

# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

వరంగల్ | శుక్రవారం - 13 - మార్చి - 2026 | సంపుటి : 3 | సంచిక : 284 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


## బీఆర్ఎస్ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు ముగింపు

- సుప్రీంకోర్టులో కేసు డిస్పోజ్
- స్పీకర్ ఆదేశాలు రెండు రోజుల్లో ప్రచురించాలని ఆదేశం
- పది మంది ఎమ్మెల్యేలకు క్లీన్ చిట్



2లో

## ఆర్టీసీ కార్మికుల సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తుతాం

- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు
- ఆర్టీసీ జేఏసీ నేతల వినతిపత్రం
- ప్రైవేటీకరణపై ప్రభుత్వాన్ని విమర్శించిన హరీశ్ రావు
- కార్మికుల హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తామని హామీ



2లో



# 1.15 కోట్ల కుటుంబాలకు బీమా

- సీఎం రేవంత్ రెడ్డి
- కోకాపేటలో మెడికవర్ ఆసుపత్రి ప్రారంభం
- మహిళా సంఘాలకు డిజిటల్ హెల్త్ కార్డులు
- విద్య, వైద్యం రంగాల్లో సంస్కరణలకు శ్రీకారం

**హైదరాబాద్, మార్చి 12 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణలో 1 కోటి 15 లక్షల కుటుంబాలకు జీవిత బీమా మరియు ఆరోగ్య భద్రత కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. విద్య, వైద్యం, వ్యవసాయం రంగాలను రాష్ట్ర ప్రభుత్వం కొత్త సవాలుగా తీసుకుందని పేర్కొన్నారు. పేదలకు సరైన విద్య, వైద్యం అందించినప్పుడు దాదాపు 90 శాతం సమస్యలు పరిష్కారం అవుతాయని ఆయన చెప్పారు.

హైదరాబాద్ కోకాపేట ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో కొత్తగా నిర్మించిన మెడికవర్ ఆసుపత్రిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి దామోదర రాజనర్సింహ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని 65 లక్షల స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులకు డిజిటల్ హెల్త్ కార్డులు జారీ చేసే ప్రక్రియ ప్రారంభించామని తెలిపారు.

మిగతా 2లో..

### కోకాపేటలో ‘అల్లు సినిమాస్’ మల్టీప్లెక్స్ ప్రారంభం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం

2లో

### హైదరాబాద్‌లో నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియో ప్రారంభం

ఫార్చూన్ 500 కంపెనీలకు హైదరాబాద్ గమ్యం: సీఎం రేవంత్

## ఎల్‌పీజీ కొరతపై కేంద్ర మంత్రికి కేటీఆర్ లేఖ

- తక్షణ జోక్యం కోరిన బీఆర్ఎస్ నేత
- హోటళ్లు, చిన్న వ్యాపారాలు సంక్షోభంలోనని ఆందోళన
- సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్



**హైదరాబాద్, మార్చి 12 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణలో ఎల్‌పీజీ సిలిండర్ల కొరతపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. రాష్ట్రంలో వాణిజ్య మరియు గృహ అవసరాల ఎల్‌పీజీ సిలిండర్ల తీవ్ర కొరతపై ఆందోళన వ్యక్తం చేస్తూ కేంద్ర పెట్రోలియం మరియు సహజ వాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీకి సమగ్ర లేఖ పంపించారు.

మిగతా 2లో..

## వెలుగుమట్ల బాధితుల ఆందోళన

పునరావాస కేంద్రం నుంచి ఖాళీ చేయిస్తున్నారన్న ఆరోపణ

పట్టాల జాబితాలో పేర్లు లేవని బాధితుల వేదన

ఎక్కడికి వెళ్లాలని ప్రశ్నిస్తున్న బాధిత కుటుంబాలు

2లో





## సంగారెడ్డిలో డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ పైలెట్ ప్రాజెక్టు

- రాష్ట్రంలో వైద్య సేవల మెరుగుదలకు కొత్త వ్యవస్థ
- 64 ప్రభుత్వ ఆసుపత్రుల్లో డిజిటల్ హెల్త్ కార్డులు
- ప్రాజెక్టు అమలుపై ఉన్నతస్థాయి సమన్వయ సమావేశం

**సంగారెడ్డి, మార్చి 12 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్రంలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ వ్యవస్థను అమలు చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పైలెట్ ప్రాజెక్టుగా సంగారెడ్డి జిల్లాలో అమలు చేయనున్నట్లు వెల్లడించారు. గురువారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ రూపకల్పన, అమలు పై రాష్ట్ర మరియు జిల్లా స్థాయి వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమన్వయ సన్నాహక సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టు అమలు విధానం, ముందస్తు ఏర్పాట్లు, అవసరమైన సాంకేతిక సదుపాయాలపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. ఈ పైలెట్ ప్రాజెక్టులో భాగంగా సంగారెడ్డి జిల్లాలోని మొత్తం 64 ప్రభుత్వ వైద్యశాలల్లో సేవలు పొందేందుకు వచ్చే ప్రతి రోగికి సంబంధించిన పూర్తి ఆరోగ్య వివరాలతో డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ రూపొందించి డిజిటల్ హెల్త్ కార్డు జారీ చేయనున్నారు.

మిగతా 2లో..



## లొంగిపోయిన మావోయిస్టులకు రివార్డు పంపిణీ

- 27 మంది మాజీ మావోయిస్టులకు ప్రోత్సాహక నగదు
- మొత్తం రూ.62.50 లక్షలు అందజేత
- ప్రధాన ప్రవాహంలోకి రావాలని పోలీసుల పిలుపు

**కొత్తగూడెం, మార్చి 12 (తెలంగాణ ముచ్చట్లు):**

వివిధ సందర్భాల్లో జిల్లా పోలీసుల ఎదుట లొంగిపోయిన 27 మంది మావోయిస్టు సభ్యులకు ప్రభుత్వం మంజూరు చేసిన రివార్డు నగదును అందజేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ రోహిత్ రాజు ఈ నగదును పంపిణీ చేశారు. వివిధ క్యాడర్లలో పనిచేసిన మాజీ మావోయిస్టులకు కలిపి మొత్తం రూ.62,50,000 నగదును ప్రోత్సాహకంగా అందజేశారు. సమాజంలోకి వచ్చి సాధారణ జీవితం గడపాలని వారికి అధికారులు సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ మావోయిస్టు సిద్ధాంతాలను విడిచిపెట్టి లొంగిపోయే వారికి ప్రభుత్వం పునరావాస పథకాల ద్వారా సహాయం అందిస్తుందని తెలిపారు. సాధారణ జీవితం ప్రారంభించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తుందని పేర్కొన్నారు. అటవీ ప్రాంతాల్లో పనిచేస్తున్న మావోయిస్టులు కూడా హింసా మార్గాన్ని విడిచి సమాజంలోకి రావాలని పోలీసులు పిలుపునిచ్చారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# హైదరాబాద్‌లో నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియో ప్రారంభం






**హైదరాబాద్, మార్చి 12 (తెలంగాణ ముచ్చట్లు)** : హైదరాబాద్‌లో నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో ఈ స్టూడియోను ప్రారంభించిన ముఖ్యమంత్రి, యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ రంగాల్లో హైదరాబాద్ విప్లవాత్మక మార్పులకు వేదిక కానుందని తెలిపారు. నెట్‌ఫ్లిక్స్ హైదరాబాద్‌ను కేంద్రంగా ఎంచుకోవడం రాష్ట్రానికి గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ నెట్‌ఫ్లిక్స్ మరింత విస్తరణకు తెలంగాణ ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీలో నెట్‌ఫ్లిక్స్ విస్తరణ కోసం అవసరమైన స్థలాన్ని కేటాయించడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. అవసరమైతే నెట్‌ఫ్లిక్స్ తన కార్పొరేట్ కార్యాలయాన్ని కూడా హైదరాబాద్‌కు మార్చాలని ఆయన కోరారు.

హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రపంచంలోని ఫార్చ్యూన్ 500 కంపెనీలు హైదరాబాద్ నుంచి కార్యకలాపాలు నిర్వహించాలన్నది తమ లక్ష్యమని చెప్పారు. 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. నెట్‌ఫ్లిక్స్ సంస్థ డీవీడీలను అద్దెకు ఇచ్చే స్థాయి నుంచి ప్రపంచ ఓటీటీ రంగంలో అగ్రగామిగా ఎదిగిందని ముఖ్యమంత్రి తెలిపారు. ఫుడ్, ట్రావెల్, వారసత్వం, సంస్కృతి వంటి అంశాల ద్వారా ప్రపంచ ప్రజలను కలుపుతూ నెట్‌ఫ్లిక్స్ వినోదాన్ని అందిస్తోందన్నారు. తెలంగాణను ప్రపంచానికి పరిచయం చేయడంలో నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఐలైన్ స్టూడియో సీఈఓ జెఫ్ షపిరో, కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజయ్ జాజు, సినీ నటుడు మరియు నిర్మాత రానా దగ్గుబాటి, తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు తదితరులు పాల్గొన్నారు. నెట్‌ఫ్లిక్స్ ప్రతినిధులు కూడా ఈ కార్యక్రమంలో హాజరయ్యారు.

# కోకాపేటలో 'అల్లు సినిమాస్' మల్టీప్లెక్స్ ప్రారంభం



**హైదరాబాద్, మార్చి 12 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోకాపేటలో అల్లు కుటుంబానికి చెందిన ఆధునిక మల్టీప్లెక్స్ "అల్లు సినిమాస్"ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దివంగత నటుడు అల్లు రామలింగయ్య విగ్రహానికి నివాళులు అర్పించారు. అనంతరం అల్లు అరవింద్, నటుడు అల్లు అర్జున్ తదితరులతో కలిసి మల్టీప్లెక్స్‌ను పరిశీలించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సంబంధించిన కొన్ని విజువల్స్‌ను మల్టీప్లెక్స్‌లో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మధ్యలో కూర్చుండగా ఒకవైపు అల్లు అర్జున్, మరోవైపు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క కూర్చున్నారు. భట్టివిక్రమార్క పక్కన అల్లు అరవింద్ కూర్చొని ఈ విజువల్స్‌ను వీక్షించారు. విజువల్స్ ప్రదర్శన సమయంలో అల్లు అరవింద్ ఏదో చెప్పగా ముఖ్యమంత్రి సరదాగా నవ్విన దృశ్యాలు ఆకట్టుకున్నాయి. ఆసియాలోనే అతిపెద్ద డాల్బీ స్క్రీన్‌తో ఈ మల్టీప్లెక్స్‌ను నిర్మించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో మొత్తం నాలుగు స్క్రీన్‌లు ఉండగా మొదటి స్క్రీన్‌లో డాల్బీ విజన్ సాంకేతికతను ఏర్పాటు చేశారు. ఈ నెల 19న ఉగాది సందర్భంగా మల్టీప్లెక్స్‌లో సినిమాల ప్రదర్శన ప్రారంభం కానున్నట్లు వెల్లడించారు. రేపటి నుంచి బుక్ మై షో ద్వారా ఆన్‌లైన్ టికెట్ బుకింగ్‌లు అందుబాటులోకి రానున్నాయి. ప్రారంభంగా "ధురంధర్-2", "ఉస్తాద్ భగత్ సింగ్" చిత్రాలు ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# 1.15 కోట్ల కుటుంబాలకు బీమా

(మొదటి పేజీ తరువాయి)

గత రెండు సంవత్సరాల్లో రాజీవ్ ఆరోగ్యశ్రీ, సీఎంఆర్‌ఎఫ్ పథకాల కింద పేదల వైద్యం కోసం రూ.1800 కోట్లను ఖర్చు చేసినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో వైద్య రంగాన్ని బలోపేతం చేయడానికి ఉస్మానియా, వరంగల్ టిమ్స్, అల్వాల్ టిమ్స్, ఎల్బీనగర్ టిమ్స్, సనత్ నగర్ టిమ్స్, నిమ్స్ వంటి ఆసుపత్రుల్లో సుమారు రూ.10 వేల కోట్ల వ్యయంతో 10 వేల పడకల ఆసుపత్రులను నిర్మిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. అలాగే విద్యా రంగంలో సంస్కరణలు చేపడుతున్నామని పేర్కొన్నారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు నాణ్యమైన విద్య అందించే విధంగా తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ వ్యవస్థను తీసుకొస్తున్నామని చెప్పారు. విద్యార్థులకు పాఠశాలల్లో నాణ్యమైన అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించడంతో పాటు కార్పొరేట్ పాఠశాలల తరహాలో ఉచితంగా లేదా సగం ఖర్చుతో రవాణా సౌకర్యం కల్పించాలనే నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. అలాగే యువత నైపుణ్యాలను పెంపొందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ప్రారంభించినట్లు తెలిపారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న వైద్యులు సామాజిక బాధ్యతగా సంవత్సరంలో కనీసం ఒక నెల పాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవలు అందించాలని సీఎం సూచించారు. వైద్యం కేవలం వృత్తి మాత్రమే కాకుండా మానవత్వంతో కూడిన సేవ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు వేమ్ నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు కుందూరు జైయవీర్ రెడ్డి, నవీన్ యాదవ్, మెడికవర్ ఆసుపత్రి చైర్మన్ అనిల్ కృష్ణ, వైద్యులు మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు ముగింపు

**న్యూఢిల్లీ, మార్చి 12 (తెలంగాణ ముచ్చట్లు)** : తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారిన బీఆర్‌ఎస్ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసుకు సుప్రీంకోర్టులో ముగింపు పలికింది. గురువారం ఈ కేసును సుప్రీంకోర్టు డిస్పోజ్ చేసింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై నిర్ణీత గడువులోగా స్పీకర్ చర్యలు తీసుకోవాలని గతంలో కోర్టు సూచించినప్పటికీ నిర్ణయం ఆలస్యం అవుతోందని ఆరోపిస్తూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కేటీఆర్, బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం చివరకు కేసును ముగించినట్లు ప్రకటించింది. ఈ కేసును జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్‌ల ధర్మాసనం విచారించింది. స్పీకర్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. ఎమ్మెల్యేల అనర్హతపై దాఖలైన పిటిషన్లను స్పీకర్ ఇప్పటికే పరిశీలించి తగిన నిర్ణయం తీసుకున్నారని ఆయన కోర్టుకు వివరించారు. దీంతో ఈ వ్యవహారం సభాపతి కార్యాలయంలోనే ముగిసిందని తెలిపారు. స్పీకర్ తరఫు వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం ఇకపై ఈ కేసుపై విచారణ కొనసాగించాల్సిన అవసరం లేదని భావించింది. ఇప్పటికే స్పీకర్ తుది నిర్ణయం తీసుకున్నందున కేసును డిస్పోజ్ చేస్తున్నట్లు వెల్లడించింది. అలాగే స్పీకర్ జారీ చేసిన ఆదేశాలను రెండు రోజుల్లో అధికారికంగా ప్రచురించాలని కోర్టు ఆదేశించింది. అదే విధంగా పిటిషనర్లకు అవసరమైన సంబంధిత పత్రాలను నాలుగు రోజుల్లో అందజేయాలని కూడా న్యాయస్థానం సూచించింది. దీంతో పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొన్న పది మంది ఎమ్మెల్యేలకు సభాపతి క్లీన్ చిట్ ఇచ్చినట్లయింది. ఈ పరిణామం తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామంగా భావిస్తున్నారు.

# ఆర్టీసీ కార్మికుల సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తుతాం: హరీశ్ రావు



**హైదరాబాద్, మార్చి 12 (తెలంగాణ ముచ్చట్లు):** : రాష్ట్ర ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్న ఆర్టీసీ కార్మికుల సమస్యలను అసెంబ్లీ వేదికగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు కలిసి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మికుల పక్షాన నిలబడి వారి సమస్యలను సభలో ప్రస్తావిస్తానని హరీశ్ రావు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకవైపు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి సంస్థను కాపాడుకోవాలని కార్మికులు పోరాడుతుంటే ప్రభుత్వం మాత్రం ఒక్కొక్క విభాగాన్ని ప్రైవేటీకరించేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. కాలుష్య నియంత్రణ పేరుతో ఎలక్ట్రిక్ బస్సుల తయారీని కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తూ వారికి సబ్సిడీలు ఇస్తున్నారని ఆరోపించారు. అలాగే రెండు వేల బస్సుల సరఫరాకు ప్రైవేట్ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా సంస్థను బలహీనపరచే ప్రయత్నం జరుగుతోందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే సబ్సిడీలను నేరుగా ఆర్టీసీకే అందజేసి సంస్థ స్వయంగా బస్సులు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారని తెలిపారు. ఉచిత ప్రయాణ పథకం అమలుకు ప్రతినెలా మూడు వందల యాభై కోట్ల రూపాయలు చెల్లిస్తామని చెప్పిన ప్రభుత్వం ప్రస్తుతం అరకొర నిధులు మాత్రమే చెల్లిస్తోందని విమర్శించారు. గత రెండు సంవత్సరాలుగా ఈ పథకానికి సంబంధించిన బకాయిల భారాన్ని ఆర్టీసీపై మోపడం వల్ల సంస్థ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటోందని అన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు రెండు పీఆర్సీలు ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయని, రెండువేల ఇరవై ఐదు పీఆర్సీ కూడా అమలుకు నోచుకోలేదని హరీశ్ రావు పేర్కొన్నారు. రిటైర్ అయిన ఉద్యోగులకు క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీలోని పొదుపు నిధులపై వడ్డీ కూడా చెల్లించలేదని తెలిపారు. కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం బీఆర్‌ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు. ప్రభుత్వం వెంటనే రెండు వేల ఎనిమిది వందల నాలుగు కోట్ల రూపాయల బకాయిలను విడుదల చేసి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

# వెలుగుమట్ల బాధితుల ఆందోళన

**ఖమ్మం, మార్చి 12 (తెలంగాణ ముచ్చట్లు):** ఖమ్మం జిల్లా వెలుగుమట్ల ప్రాంతానికి చెందిన బాధితులు తమను ప్రభుత్వం రోడ్డున పడేస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇల్లు కోల్పోయిన వారు తాత్కాలిక పునరావాసంగా అంబేద్కర్ భవన్లో నివసిస్తుండగా, ఇప్పుడు అక్కడి నుంచి కూడా ఖాళీ చేయిస్తున్నారని ఆరోపిస్తున్నారు. పోలీసులు వచ్చి భవనాన్ని ఖాళీ చేయాలని చెప్పడంతో బాధిత కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి. ఇటీవల ప్రభుత్వం పంపిణీ చేసిన పట్టాల జాబితాలో అర్హులైన తమ పేర్లు లేకపోవడంతో బాధితులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. తాము అన్ని అర్హతలు ఉన్నప్పటికీ పట్టాల జాబితాలో చోటు కల్పించలేదని వారు పేర్కొన్నారు. ఇప్పటికే ఇల్లు కోల్పోయి కష్టాలు ఎదుర్కొంటున్న సమయంలో ఇప్పుడు పునరావాస కేంద్రం నుంచి కూడా వెళ్లిపోవాలని చెప్పడం తమను మరింత ఇబ్బందుల్లోకి నెట్టేస్తోందని అన్నారు. అంబేద్కర్ భవన్లోనే కొంతకాలంగా ఆశ్రయం పొందుతున్నామని, ఇప్పుడు అక్కడి నుంచి కూడా పంపిస్తే ఎక్కడికి వెళ్లాలో తెలియడం లేదని బాధితులు వాపోతున్నారు. ప్రభుత్వం తమ పరిస్థితిని అర్థం చేసుకుని న్యాయం చేయాలని, అర్హులైన వారందరికీ పట్టాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు. సమస్యకు పరిష్కారం చూపాలని బాధిత కుటుంబాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి.



# ఎల్‌పీజీ కొరతపై కేంద్ర మంత్రికి కేటీఆర్ లేఖ

(మొదటి పేజీ తరువాయి)

గ్యాస్ కొరత కారణంగా హోటళ్లు, హాస్టళ్లు మరియు చిన్న తరహా ఆహార వ్యాపారాలు తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. గ్యాస్ సరఫరా తక్షణమే పునరుద్ధరించకపోతే హైదరాబాద్ మరియు తెలంగాణవ్యాప్తంగా దాదాపు 90 శాతం హోటళ్లు, రెస్టారెంట్లు వచ్చే 48 గంటల్లో మూతపడే ప్రమాదం ఉందని తెలంగాణ హోటల్ అసోసియేషన్ హెచ్చరించినట్లు తెలిపారు.

ఐటీ కారిడార్‌లోని పీజీ హాస్టళ్లలో నివసిస్తున్న లక్షలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు భోజనం దొరకని పరిస్థితి ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గ్యాస్ కేటాయింపుల్లో పెద్ద సంస్థలకన్నా చిన్న వ్యాపారులు, వీధి వ్యాపారులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్యాస్ లభ్యతపై ప్రజల్లో ఉన్న అయోమయాన్ని తొలగించేందుకు జిల్లా స్థాయి పంపిణీ వివరాలతో పబ్లిక్ డాష్‌బోర్డ్ ఏర్పాటు చేయాలని కేటీఆర్ కోరారు. అలాగే సంక్షోభం ముగిసే వరకు వాణిజ్య సిలిండర్ల ధరలను పెంచకుండా నియంత్రించాలని డిమాండ్ చేశారు. గృహ అవసరాల సిలిండర్లను అక్రమంగా మళ్లిస్తూ అధిక ధరలకు విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పీజీ హాస్టళ్లు, గ్యాస్ ఆధారిత శ్మశాన వాటికలను అవసర సేవలుగా గుర్తించి నిరంతర సరఫరా అందించాలని కోరారు. హోటల్ రంగంపై ఆధారపడి జీవిస్తున్న లక్షలాది మంది కార్మికులకు ఉపాధి భద్రత కల్పించేందుకు అవసరమైతే సహాయక నిధి ఏర్పాటు చేయాలని కేటీఆర్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

# సంగారెడ్డిలో డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ పైలెట్ ప్రాజెక్టు

(మొదటి పేజీ తరువాయి)

ఇందులో ఒక ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి, నాలుగు ఏరియా ఆసుపత్రులు, ఐదు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, నాలుగు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు, 31 ప్రైమరీ హెల్త్ సెంటర్లు, 19 బస్తీ దవాఖానాలు ఉన్నాయి. రోగి ఆసుపత్రికి వచ్చిన మొదటి దశ నుంచి చికిత్స పూర్తయ్యే వరకు ఓపీ, వైద్య అధికారి, ప్రయోగశాల, ఔషధశాల వంటి అన్ని విభాగాల్లో రోగి వైద్య చరిత్రను డిజిటల్ రూపంలో నమోదు చేసే విధంగా ఐటీ సదుపాయాలు, మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. అవసరమైన సిబ్బందిని అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్యకు ఆదేశించారు. డిజిటల్ హెల్త్ కార్డు ద్వారా రోగి పూర్తి వైద్య చరిత్ర డిజిటల్ రూపంలో అందుబాటులో ఉండటం వల్ల వైద్యులు త్వరితగతిన సరైన చికిత్స అందించగలరని మంత్రి తెలిపారు. అలాగే గుండె సంబంధిత వ్యాధులు, క్యాన్సర్, ఇతర సంక్రమణ మరియు అసంక్రమణ వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి అవసరమైన చికిత్స అందించేందుకు ఇది ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి డా. క్రిస్టినా జెడ్ చొంగ్తు, ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈవో ఉదయ్ కుమార్, జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్యతో పాటు రాష్ట్ర మరియు జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. సంగారెడ్డి జిల్లాలో అమలు చేయనున్న ఈ పైలెట్ ప్రాజెక్టు రాష్ట్రవ్యాప్తంగా డిజిటల్ హెల్త్ కార్డు అమలుకు ఆదర్శంగా నిలవాలని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.



# మద్దిగట్ల–మోజర్ల పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు



**పెద్దమందడి, మార్చి 12(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మద్దిగట్ల-మోజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఎస్. వరప్రసాద్ రావు మాట్లాడుతూ పాఠశాలలోని ఉపాధ్యాయులందరూ విద్యార్థుల కోసం ఎంతో శ్రద్ధతో బోధన నిర్వహించారని తెలిపారు. అందువల్ల విద్యార్థులందరూ రాబోయే పదవ తరగతి పరీక్షల్లో 100% ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. సీనియర్ ఉపాధ్యాయులు డి. రణదీవ్ మాట్లాడుతూ ప్రశ్నపత్రాన్ని చూసి విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఎక్కువ భాగం ప్రశ్నలు సులభంగా ఉంటాయని చెప్పారు. పి. వెంకటస్వామి మాట్లాడుతూ.. విద్యార్థులందరూ ధైర్యంగా పరీక్షలు రాసి విజయాన్ని సాధించాలని సూచించారు. గద్వాల కృష్ణ మాట్లాడుతూ.. పరీక్షలంటే భయపడాల్సిన అవసరం లేదని, విద్యార్థులలో భయాన్ని తొలగించేందుకు తరచూ పరీక్షలు నిర్వహించామని తెలిపారు.శ్రీమతి వాణి ప్రభ మాట్లాడుతూ ఆంగ్లంలో ఉత్తీర్ణత సాధించడం చాలా సులభమని తెలిపారు.పుల్లయ్య మాట్లాడుతూ జీవశాస్త్ర విభాగంలో ప్రయోగాలు, పటాలను సరిగ్గా వేస్తే ఉత్తీర్ణత సాధించడం సులభమని చెప్పారు. మధుసూదన్ మాట్లాడుతూ.. హిందీ విషయాన్ని సులభంగా అర్థం చేసుకొని మంచి మార్కులు సాధించవచ్చని తెలిపారు.ఎన్. వెంకటస్వామి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఇతర అంశాలలో కూడా అభివృద్ధి సాధించడం ముఖ్యమని సూచించారు.ఏ.వెంకటస్వామి మాట్లాడుతూ.. మొదటి పరీక్ష తెలుగు కాబట్టి భయపడకుండా ప్రశ్నను సరిగా అర్థం చేసుకొని సమాధానం రాయాలని చెప్పారు. శ్రీనివాసులు మాట్లాడుతూ సాంఘిక శాస్త్రంలో మ్యాప్ పాయింటింగ్ మరియు ప్రాజెక్టు వివరాలను సరిగ్గా చదివితే అధిక మార్కులు పొందవచ్చని తెలిపారు.చిన్నారెడ్డి, కృష్ణవేణి విద్యార్థులు అందరూ మంచి ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు పరీక్షలకు సంబంధించిన సామాగ్రి మరియు హాల్ టికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమం అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు.

# కాంగ్రెస్ జెండా కిందనే చివరి వరకు పని చేయాలి

- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**వనపర్తి, మార్చి12(తెలంగాణ ముచ్చట్లు):** కాంగ్రెస్ పార్టీ జెండా నీడలోనే చివరి వరకు పనిచేయాలని, పార్టీ మార్గదర్శకాలను తప్పక పాటించాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు.వనపర్తి మండల మరియు పట్టణ కాంగ్రెస్ కమిటీల ఏర్పాటు కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఆర్జీ గార్డెన్స్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శివసేనరెడ్డి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి తదితరులతో కలిసి ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజల మద్దతు పెరుగుతోందని, వచ్చే పదిహేను సంవత్సరాల పాటు కాంగ్రెస్ పార్టీ అధికారంలో కొనసాగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. తెలంగాణలో భారత రాష్ట్ర సమితి పూర్తిగా ప్రజల విశ్వాసం కోల్పోయిందని, భారతీయ జనతా పార్టీ కూడా బలహీన స్థితిలో ఉందని విమర్శించారు.దేశ రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడాలని, భావి భారత ప్రధానిగా రాహుల్ గాంధీని చూడాలనే లక్ష్యంతో ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు.గ్రామస్థాయి నుంచి పార్టీని బలపర్చేందుకు అధిష్ఠానం ప్రత్యేక చర్యలు చేపట్టిందని, అందులో భాగంగా గ్రామ, మండల కమిటీలతో పాటు అనుబంధ సంఘాల కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పార్టీ కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. పట్టణ సంస్థల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సభ్యులు, వార్డు సభ్యులు, గ్రామ సర్పంచులు, ఉపసర్పంచులు, మండల పరిషత్ సభ్యులు, జిల్లా పరిషత్ సభ్యులు, వ్యవసాయ మార్కెట్ యార్డు అధ్యక్షులు, మహిళా సంఘాలు, వెనుకబడిన వర్గాలు, అనుసూచిత జాతులు, అనుసూచిత తెగలు, మైనారిటీ సంఘాల బాధ్యులు వంటి అనేక బాధ్యతల్లో కార్యకర్తలకు అవకాశాలు ఉంటాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వనపర్తి నియోజకవర్గ అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించామని ఆయన వివరించారు. ఇల్లు లేని నిరుపేదల కోసం ఐదు లక్షల రూపాయల విలువతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. వనపర్తి పట్టణంలోని ముప్పై మూడు వార్డుల్లో యాభై కోట్ల రూపాయలతో సిమెంట్ రహదారులు నిర్మించామని, డెబ్బై కోట్ల రూపాయలతో విద్యుత్ సమస్యల పరిష్కారం, అమృత్ పథకం ద్వారా తాగునీటి పనులు చేపట్టామని తెలిపారు. ఇంకా రెండు వందల కోట్ల రూపాయలతో సమగ్ర పాఠశాలలు, రెండు వందల యాభై కోట్ల రూపాయలతో ఐదు వందల పడకల ఆసుపత్రి, ఎనభై ఒక కోట్ల రూపాయలతో న్యాయస్థాన భవనం నిర్మాణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. అలాగే సమాచార సాంకేతిక భవనం, బయపాస్ రహదారి, వలయ రహదారి, కేంద్రీయ విద్యాలయం, పంచాయతీరాజ్ రహదారులు వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.మహిళల అభ్యున్నతికి ఉచిత బస్సు ప్రయాణం, వడ్డీ లేని రుణాలు, మహిళా భోజనశాలలు, విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించే కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. వనపర్తి నియోజకవర్గంలో మాత్రమే ముప్పై రెండు వేల రేషన్ కార్డులు మంజూరు చేశామని చెప్పారు. రైతుల కోసం రైతు భరోసా, రైతు బీమా, సన్న వడ్లకు ప్రోత్సాహక ధనం, సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు పంపిణీ వంటి పథకాలు అమలు చేస్తున్నామని వివరించారు.ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు చేరవేయడంలో కార్యకర్తలు ముందుండాలని ఆయన పిలుపునిచ్చారు. వనపర్తి నియోజకవర్గానికి రెండు వ్యవసాయ మార్కెట్ యార్డులు, ఏడు వ్యవసాయ సేవా కేంద్రాలు మంజూరు చేయించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో వనపర్తి పట్టణ సంస్థ అధ్యక్షురాలు మాధవి రమేష్, ఉపాధ్యక్షుడు మధుసూదన్ గౌడ్, మార్కెట్ యార్డు అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, ఇతర నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.





# ప్రజల సమస్యల పరిష్కారమే ప్రజాప్రతినిధుల లక్ష్యం కావాలి

- కొత్తగూడెంలో నూతన ప్రజాప్రతినిధులకు శిక్షణా తరగతులు.
- పాల్గొన్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ.

**అశ్వారావుపేట, మార్చి 12 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించేందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం క్లబ్‌లో గురువారం ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ అంకిత్, ఐఏఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ ప్రజలు తమపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం ప్రతి ప్రజా ప్రతినిధి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని తక్షణమే పరిష్కరించే దిశగా మేయర్లు, కార్పొరేటర్లు, డిప్యూటీ మేయర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, గ్రామపంచాయతీ సర్పంచులు కృషి చేయాలని సూచించారు. ప్రజలతో ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి అవసరాలను గుర్తించి అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు సక్రమంగా చేరవేసే బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని ఆయన తెలిపారు. గ్రామాలు, పట్టణాల అభివృద్ధి కోసం ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలకు పారదర్శకమైన పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు ప్రభుత్వ విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ శిక్షణా కార్యక్రమాల ద్వారా పాలన విధానం, అభివృద్ధి పథకాల అమలు, ప్రజల సమస్యల పరిష్కారం వంటి అంశాలపై స్పష్టత కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ మున్సిపాలిటీల మేయర్లు, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, కౌన్సిలర్లు, గ్రామపంచాయతీ సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.





# పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామాగ్రి పంపిణీ

- ఆదర్శంగా నిలిచిన మిత్రులు షేక్ రంజాన్, పగిలిపల్లి గణేష్

**ఖమ్మం బ్యూరో, మార్చి 12(తెలంగాణ ముచ్చట్లు):** వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ఇద్దరు యువ మిత్రులు తమ ఉదారతను చాటుకున్నారు. మండల పరిధిలోని నేరడ మరియు చింతకాని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు షేక్ రంజాన్ మరియు పగిలిపల్లి గణేష్ అనే మిత్రులు సొంత ఖర్చులతో పరీక్షా సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు ఎటువంటి ఆందోళన లేకుండా పరీక్షలు రాసి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలనే లక్ష్యంతో ఈ చిన్న సహాయం చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు చదువులో రాణించి గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పరీక్షల సమయంలో తమకు అవసరమైన సామాగ్రిని అందించినందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు గ్రామస్తులు ఆ మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# మైనారిటీ మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- మంత్రి పొంగులేటి




**ఖమ్మం బ్యూరో, మార్చి 12(తెలంగాణ ముచ్చట్లు):** మైనారిటీ మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉచితంగా కుట్టు మిషన్లను పంపిణీ చేస్తోందని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. గురువారం కూసుమంచి క్యాంప్ కార్యాలయంలో ఇందిరా మహిళా శక్తి పథకం కింద పాలేరు నియోజకవర్గానికి చెందిన 163 మంది ముస్లిం మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్లను, అలాగే మండలంలోని మస్జిద్ కమిటీలకు 350 రంజాన్ తోఫా గిఫ్ట్ ప్యాకెట్లను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతి నియోజకవర్గంలో సుమారు 200 కుట్టు మిషన్లను పంపిణీ చేస్తున్నామని, మహిళలు తమ నైపుణ్యంతో సంపాదన పెంచుకున్నప్పుడే కుటుంబాలు ఆర్థికంగా స్థిరపడతాయని ఆకాంక్షించారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, అందులో భాగంగానే మైనారిటీల అభ్యున్నతికి పలు కార్యక్రమాలు చేపడుతున్నామని మంత్రి పేర్కొన్నారు. పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకుని ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు చేస్తూ సర్వమత సౌభ్రాతృత్వం కోసం ప్రార్థించడం అభినందనీయమన్నారు. అల్లా దీవెనలతో మైనారిటీ సోదరుల కోరికలు నెరవేరాలని ఆయన కోరారు.

# నిజమైన భూదాన్ బాధితులకు తీవ్ర అన్యాయం

- పైరవీ కారులకు పట్టాలు ఇచ్చారు
- రీ సర్వే చేసి నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయాలి
- అక్రమాలకు పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- విలేకరుల సమావేశంలో వెలుగుమట్ల భూదాన్ బాధితులు




**ఖమ్మం బ్యూరో, మార్చి 12 (తెలంగాణ ముచ్చట్లు):** ఖమ్మం వెలుగుమట్లలో నిజమైన భూదాన్ బాధితులకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వకుండా, కొంతమంది అనర్హులకు, అక్రమార్కులకు, పైరవీకారులకు పట్టాలు పంపిణీ చేశారని, అసలైన బాధితులకు తీవ్ర అన్యాయం జరిగిందని భూదాన్ భూముల బాధితులు పేర్కొన్నారు. ఖమ్మం ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో భూదాన్ బాధితులు సత్యనారాయణ రెడ్డి, నరగాని కోటేశ్వరరావు, రవి, సీతారాములు, కళ్యాణి, కవిత, జయమ్మలు మాట్లాడుతూ... 8 సంవత్సరాలుగా తాము వెలుగుమట్ల భూదాన్ భూములలో గుడిసెలు వేసుకుని, ఇండ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నామని, కొందరు వ్యక్తులు తమ వద్ద డబ్బులు వసూలు చేసి ఇండ్ల స్థలాలు ఇస్తామని చెప్పి తమను మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులు హడావుడిగా, సక్రమంగా సర్వే చేయకుండా అసలైన లబ్ధిదారులను గుర్తించకుండా, కాలనీకి చెందని వారికి పట్టాలి ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు..? ఎటువంటి సౌకర్యాలు లేకపోయినా రాత్రింబవళ్లు చీకట్లో ఉండి పాములు, తేళ్ల మధ్య నివాసం గడిపి, నీళ్లు లేక, కరెంటు లేక అనేక ఇబ్బందులు పడ్డ తమలాంటి కుటుంబాలను గుర్తించకుండా అనర్హులను ఎలా ఎంపిక చేస్తారని నిలదీశారు. సర్వం కూలిపోయి రోడ్డు పాలైన తమలాంటి వారికి అన్యాయం చేయటం సరైనది కాదన్నారు. మరొక్కసారి రీ సర్వే నిర్వహించి నిజమైన లబ్ధిదారులను గుర్తించి తమను ఆదుకోవాలని వేడుకున్నారు. ఈ విలేకరుల సమావేశంలో సిరికొండ కళ్యాణి, గాదె భాగ్యలక్ష్మి, పసుమర్తి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లిపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# ఖమ్మంలో 'లైఫ్ లైన్ ఫౌండేషన్' టీ-షర్టు ఆవిష్కరణ

- పేదలకు సేవ చేయడమే లక్ష్యం: డాక్టర్ కూరపాటి ప్రదీప్




**ఖమ్మం బ్యూరో, మార్చి 12(తెలంగాణ ముచ్చట్లు):** నగరంలో సామాజిక సేవే లక్ష్యంగా ఏర్పాటైన 'లైఫ్ లైన్ ఫౌండేషన్' తన కార్యకలాపాలను ముమ్మరం చేస్తోంది. ఇందులో భాగంగా ఫౌండేషన్ సభ్యులు రూపొందించిన అధికారిక టీషర్టులను ప్రముఖ పిల్లల వైద్యులు, అభయ హాస్పిటల్ సీఈవో డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ కూరపాటి ప్రదీప్ మాట్లాడుతూ.. యువత ఇటువంటి సేవా దృక్పథంతో ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు. నిరుపేదలకు, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడంలో లైఫ్ లైన్ ఫౌండేషన్ ముందుండాలని ఆయన ఆకాంక్షించారు. సమాజంలో ఇటువంటి సంస్థల అవసరం ఎంతైనా ఉందని, ఫౌండేషన్ చేసే ప్రతి మంచి పనికి తన వంతు సహకారం ఉంటుందని తెలిపారు.

ఘన సత్కారం: టీషర్టు ఆవిష్కరణ అనంతరం ఫౌండేషన్ సభ్యులు డాక్టర్ కూరపాటి ప్రదీప్ ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు షేక్ జానీ మియా మాట్లాడుతూ.. తమ సంస్థ ద్వారా భవిష్యత్తులో మరిన్ని వినూత్న సేవా కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు:
షేక్ జానీ మియా వ్యవస్థాపకులు, లైఫ్ లైన్ ఫౌండేషన్, షేక్ ఇమ్రాన్, షేక్ అమీర్, షేక్ మన్సూర్ అలీ, షేక్ జుల్ఫీకర్అలీ, ఎండీ రహీం, షేక్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రసన్నాంజనేయ స్వామి పునఃప్రతిష్టకు తుమ్మలకు ఆహ్వానం

- 25న సత్తుపల్లి హనుమాన్ నగర్‌లో మహోత్సవం.
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఆహ్వాన పత్రిక అందజేత.
- ఆలయ కమిటీ సభ్యుల మర్యాదపూర్వక భేటీ.

**సత్తుపల్లి, మార్చి 12 (తెలంగాణ ముచ్చట్లు):** ఈనెల 25వ తేదీన సత్తుపల్లి హనుమాన్ నగర్‌లో అంగరంగ వైభవంగా నిర్వహించనున్న శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. దమ్మపేట మండల పరిధిలోని గండుగులపల్లి గ్రామంలో గురువారం ఉదయం మంత్రి తుమ్మల నాగేశ్వరరా3వును కలిసి ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చల్లగుళ్ళ నరసింహారావు, కృష్ణారెడ్డి, కిట్టు, రఘు, సత్యం తదితరులు పాల్గొన్నారు.








# ప్రజా సేవలో భాగస్వామ్యం.. భగవంతుడిచ్చిన వరం!

- ప్రజల దీవెనలతోనే ఈ స్థాయికి చేరుకున్నాం
- నిధుల వినియోగంలో నూతన ప్రజా ప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలి
- శిక్షణ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**ఖమ్మం బ్యూరో, మార్చి 12(తెలంగాణ ముచ్చట్లు):** "రాజకీయాల్లోకి మనం వచ్చింది కేవలం ప్రజా సేవ కోసమే. ఐదేళ్ల తర్వాత మనం పదవి నుంచి దిగిపోయేటప్పుడు.. మన గ్రామం, మన వార్డు ఎంతో అభివృద్ధి చెందిందని ప్రజలు మనల్ని మనస్ఫూర్తిగా అభినందించాలి. ఆ ఆత్మీయతే మనం సంపాదించుకునే అసలైన ఆస్తి" అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో నూతనంగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

అభివృద్ధికి బాటలు వేద్దాం

గ్రామ పంచాయతీల బలోపేతం కోసం ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. "గడిచిన కొద్ది రోజుల్లోనే పంచాయతీల ఖాతాల్లోకి గణనీయంగా నిధులు జమ అయ్యాయి. మార్చి ఆఖరు నాటికి మరిన్ని నిధులు రాబోతున్నాయి. ఈ నిధులను ఒక ప్రణాళికాబద్ధంగా, ప్రజలకు ఉపయోగపడే పనుల కోసం వినియోగించాలి. మన సొంత డబ్బును ఎంత జాగ్రత్తగా వాడుకుంటామో.. ప్రజా ధనాన్ని కూడా అంతే బాధ్యతగా కాపాడుతూ అభివృద్ధి పనులు చేపట్టాలి" అని సర్పంచులకు సూచించారు.

సమన్వయంతో సమస్యల పరిష్కారం

అభివృద్ధి పనుల నిర్వహణలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలని మంత్రి కోరారు. ముఖ్యంగా తాగునీరు, డ్రైనేజీ వంటి మౌలిక వసతుల కల్పనలో చిన్నపాటి సమయస్ఫూర్తితో వ్యవహరిస్తే మంచి ఫలితాలు వస్తాయని వివరించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు.

అందరి లక్ష్యం ప్రజా శ్రేయస్సే

"ఎన్నికల వరకే రాజకీయాలు.. గెలిచిన తర్వాత మనమంతా ప్రజల సేవకులం. పార్టీలకతీతంగా ప్రతి పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలి" అని మంత్రి పిలుపునిచ్చారు. ముఖ్యంగా కొత్తగా ఎన్నికైన మహిళా ప్రజాప్రతినిధులకు అధికారులు పూర్తి స్థాయిలో మార్గనిర్దేశం చేస్తూ, వారిని ప్రోత్సహించాలని ఈ వేదిక ద్వారా కోరారు. ప్రభుత్వం చేపట్టిన ఈ 99 రోజుల ప్రణాళికలో అందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని ఆకాంక్షించారు.

# శాంతినగర్ వాసులకు శుభవార్త..

- ఆర్ టిసి బస్ స్టాప్ మంజూరు అయింది
- 20వార్డ్ కౌన్సిలర్ ఉండ్రు వరలక్ష్మి శ్యాంబాబు
- వైరా ఎమ్మెల్యే కు చైర్మన్
- కాపా చంద్రకళ మురళీకృష్ణకు శ్యాంబాబువరలక్ష్మి కృతజ్ఞతలు



**ఖమ్మం బ్యూరో,మార్చి 12 (తెలంగాణ ముచ్చట్లు) :** గత సంవత్సర కాలంగా ఎదురు చూస్తున్నా ఆర్ టిసి బస్ స్టాప్ మంజూరు అయింది, వార్డ్ కౌన్సిలర్ ఉండు వరలక్ష్మి, శ్యాంబాబు సమస్యను వైరా ఎమ్మెల్యే మాలోతూ రాందాస్ నాయక్ దృష్టికి తీసుకొని వెళ్లడంతో, ఆర్టీసీ అధికారులతో మాట్లాడి, శాంతినగర్ లో బస్ స్టాప్ ఏర్పాటు చేశారు, ఖమ్మం నుండి వైరా వచ్చే బస్సులు, వైరా నుండి ఖమ్మం వైపు వెళ్లే బస్సు, ఆర్డినరీ, ఎక్స్ప్రెస్ సర్వీస్ లు శాంతినగర్లో ఆగనున్నాయి, శాంతినగర్కు బస్ స్టాప్ ఏర్పాటు చేయించిన ఎమ్మెల్యే మాలోతూ రాందాస్ నాయక్ కు వైరా మున్సిపాలిటీ చైర్మన్ కాపా చంద్రకళ మురళీకృష్ణ కుశ్యాంబాబు, వరలక్ష్మి కృతజ్ఞతలు తెలియజేశారు,

పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య ప్రదాయిని, 20వ వార్డు కౌన్సిలర్ ఉండు వరలక్ష్మి, వైరా 20వ వార్డులో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లోభాగంగా,గురువారం బోర్లు మరమ్మత్తు చేయించారు, మురికి కాలువలను శుభ్రం చేసి, తాగునీటి సరఫరా ట్యాంకులలో క్లోరినేషన్ చేశారు .ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది. మహిళలు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పరీక్షా ప్యాడ్ల పంపిణీ




**ఖమ్మం బ్యూరో, మార్చి 12(తెలంగాణ ముచ్చట్లు):** స్థానికంగా ఉన్న శ్రీ గ్లోబల్ హై స్కూల్ లో విద్యార్థులకు పరీక్షల కోసం ఉపయోగపడే విధంగా శ్రీ సాయి మారుతి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో పరీక్షా ప్యాడ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నర్సరీ నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులతో పాటు పదో తరగతి విద్యార్థులకు కూడా పరీక్షా ప్యాడ్లు అందజేశారు.ఈ పంపిణీ కార్యక్రమంలో శ్రీ సాయి మారుతి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ మరియు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల కరస్పాండెంట్ ఇనుకుల్ల దివాకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల చదువుకు ప్రోత్సాహం కలిగించే ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఆసుపత్రి యాజమాన్యాన్ని మరియు సిబ్బందిని అభినందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ తన్నీరు రామారావు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని వారు తెలిపారు.



# మున్సిపాలిటీ ఆవరణలో భారీ ఇనుప ఛానల్ మాయం.!

- డోజర్ బ్లేడ్‌కు ఉపయోగించే సామగ్రి గల్లంతు.
- భద్రతపై ప్రశ్నలు... విచారణలో అధికారులు.

**కల్లూరు, మార్చి 12 (తెలంగాణ ముచ్చట్లు):** కల్లూరు మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణలో ఉంచిన డోజర్ బ్లేడ్‌కు ఉపయోగించే భారీ ఇనుప ఛానల్ మాయం కావడం కలకలం రేపుతోంది. సాధారణంగా ముగ్గురు లేదా నలుగురు కలిసి ఎత్తాల్సినంత బరువైన ఈ ఇనుప ఛానల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు సమాచారం. మున్సిపాలిటీ కార్యాలయ ప్రాంగణంలోనే విలువైన సామగ్రి ఇలా మాయం కావడం పట్ల స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఘటనపై మున్సిపల్ అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలిసింది. ఈ సంఘటన ఎలా జరిగింది? ఎవరు తీసుకెళ్లారు? అనే అంశాలపై అధికారులు విచారణ చేపట్టినట్లు సమాచారం. మున్సిపాలిటీ ఆస్తుల భద్రతపై అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని స్థానికులు సూచిస్తున్నారు.




# ప్రతిమ ఫౌండేషన్ వారి ఉచిత వైద్య సేవలు

**భీమదేవరపల్లి, మార్చి 12(తెలంగాణ ముచ్చట్లు):** భీమదేవరపల్లి గ్రామంలో ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య సేవలను గ్రామ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి ఒక ప్రత్యేక కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ ప్రతిమ హాస్పిటల్‌కు చెందిన ఉచిత వైద్య సేవల బస్సును గ్రామ సర్పంచ్ మాచెర్ల కుమారస్వామి గారు ప్రారంభించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ మాచెర్ల కుమారస్వామి గారు మాట్లాడుతూ గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకోవాలని కోరారు. ప్రతిమ ఫౌండేషన్ ద్వారా ఉచిత ఓపీ సేవలు, ముఖ్యంగా కంటి సంబంధిత పరీక్షలు మరియు అవసరమైన వారికి ఉచిత కంటి ఆపరేషన్లు కూడా అందించబడుతున్నాయని తెలిపారు. గ్రామ ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఈ వైద్య సేవలను ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు.

గ్రామంలో వైద్య సదుపాయాలు అందరికీ సులభంగా అందేలా ప్రతిమ ఫౌండేషన్ చేపడుతున్న ఈ సేవలు ఎంతో ఉపయోగకరమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామంలోని వృద్ధులు, మహిళలు మరియు ఇతర ప్రజలు తమ ఆరోగ్య సమస్యలను గుర్తించి చికిత్స పొందే అవకాశం కలుగుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు లలిత గారు, మండల ప్రతిమ ఫౌండేషన్ ఆర్గనైజర్ మాడుగుల విక్రమ్ గారు, బస్ ఇన్‌చార్జ్ ఈశ్వర్ గారు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమం సాఫల్యంగా నిర్వహించబడింది.



# కావూరి సాంబశివరావు మృతి పట్ల కేటీఆర్ సంతాపం

- నివాళులర్పించిన బీఆర్ఎస్ నేతలు

**ఖమ్మం బ్యూరో, మార్చి 12(తెలంగాణ ముచ్చట్లు):** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) హైదరాబాద్ లోని మాజీ కేంద్ర మంత్రి కావూరి సాంబశివరావు నివాసానికి వెళ్లి ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కావూరి కుటుంబ సభ్యులను పరామర్శించిన కేటీఆర్, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కేటీఆర్ వెంట మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ మరియు మాగంటి సునీత గోపీనాథ్ వంటి కీలక నేతలు ఉన్నారు

## పేదల ఆత్మగౌరవమే ప్రభుత్వ లక్ష్యం



- అర్హులైన ప్రతి ఒక్కరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు
- కూసుమంచి మండల పర్యటనలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**ఖమ్మం బ్యూరో, మార్చి 12,(తెలంగాణ ముచ్చట్లు):** పేద ప్రజలు ఆత్మగౌరవంతో, ఆనందంగా జీవించాలన్నదే ఇందిరమ్మ ప్రభుత్వ ప్రధాన ఆశయమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి ఆయన కూసుమంచి మండలంలో విస్తృతంగా పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు, గట్టుసింగారం వద్ద 100 పడకల ఆసుపత్రి నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు.
పాలేరు లేక్ వద్ద రూ. 5 కోట్లతో చేపట్టనున్న పర్యాటక సౌకర్యాల అభివృద్ధి పనులకు మంత్రి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యాటకులు, స్థానిక ప్రజలు ఆహ్లాదంగా గడిపేలా సరస్సును ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. లేక్ వద్ద చేపట్టే పనుల ప్రణాళికను పరిశీలించి, నాణ్యతతో కూడిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అనంతరం మల్లాయిగూడెం గ్రామం నుండి ఆంజనేయస్వామి దేవాలయం వరకు రూ. 1.35 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులను ప్రారంభించారు. రాబోయే వర్షాకాలం లోపే ఈ రోడ్డు నిర్మాణం పూర్తి కావాలని స్పష్టం చేశారు.
ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ కీలక ప్రకటనలు చేశారు. అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం తప్పనిసరిగా మంజూరు చేస్తుందని భరోసా ఇచ్చారు. కొత్త రేషన్ కార్డుల పంపిణీతో పాటు సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని, సన్న వడ్లకు క్వింటాకు రూ. 500 బోనస్ అందిస్తున్నామని వివరించారు. గట్టుసింగారంలో పట్టాలు లేని నిరుపేదలపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, తక్షణమే వారికి పట్టాలు అందజేయాలని అధికారులను ఆదేశించారు.
రాబోయే వేసవి కాలం దృష్ట్యా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ఎక్కడా నీటి ఎద్దడి రాకుండా బోర్ల మరమ్మతులు వెంటనే చేపట్టాలన్నారు. గ్రామాలకు గత నెలన్నర రోజులలో భారీగా నిధులు విడుదలయ్యాయని, మార్చి 31 లోపు మరిన్ని నిధులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

## క్యాస్ట్రోల్ కూపన్ స్కాన్ చేసి బుల్లెట్ బైక్ గెలుచుకున్న మెకానిక్




- అదృష్టం అందిపుచ్చుకున్న మెకానిక్ నకిరికంటి నగేష్

**ఖమ్మం బ్యూరో, మార్చి 12(తెలంగాణ ముచ్చట్లు):** క్యాస్ట్రోల్ కంపెనీ నిర్వహిస్తున్న యాక్టివ్ కూపన్ స్కాన్ అండ్ విన్ కార్యక్రమంలో భాగంగా తిరుమలాయపాలెం మండలం కాకరవాయి గ్రామానికి చెందిన మెకానిక్ నకరికంటి నగేష్ అదృష్టాన్ని అందిపుచ్చుకున్నారు. క్యాస్ట్రోల్ యాక్టివ్ కూపన్‌ను స్కాన్ చేయడంతో ఆయనకు సుమారు రూ.2 లక్షల విలువైన రాయల్ ఎన్ఫీల్డ్ బుల్లెట్ మోటార్ సైకిల్ బహుమతిగా లభించింది. ఈ బహుమతిని బుధవారం ఖమ్మంలోని జాబిశెట్టి రాయల్ ఎన్ఫీల్డ్ షోరూంలో క్యాస్ట్రోల్ సంస్థ ప్రతినిధులు నగేష్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్యాస్ట్రోల్ ఖమ్మం డిస్ట్రిబ్యూటర్ నాళ్లా ప్రశీల్, ఖమ్మం జిల్లా ఏరియా సేల్స్ మేనేజర్ గంగా శివప్రసాద్, మార్కెటింగ్ యాక్టివిటీ మేనేజర్ సలీమ్, టీమ్ లీడర్ చిరాలా కృష్ణప్రసాద్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ శంకరనాథ్ పాల్గొన్నారు. అదేవిధంగా ఖమ్మం జిల్లా మెకానిక్ యూనియన్ అధ్యక్షుడు షఫీతో పాటు పలువురు మెకానిక్ సోదరులు కూడా కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా బహుమతి అందుకున్న నగేష్ ఆనందం వ్యక్తం చేస్తూ క్యాస్ట్రోల్ కంపెనీకి కృతజ్ఞతలు తెలిపారు.

## అంతోటి శ్రీనివాస్ ను పరామర్శించిన టి.డ.బ్ల్యూ.జే.ఎఫ్



హెచ్ 2843 జిల్లా నాయకులు

**ఖమ్మం బ్యూరో, మార్చి 12(తెలంగాణ ముచ్చట్లు):** ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అంతోటి శ్రీనివాస్ అనారోగ్యంతో ఇంట్లో విశ్రాంతి తీసుకుంటుండగా టిడబ్ల్యూజేఎఫ్ (హెచ్ 2843) నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న నాయకులు త్వరగా కోలుకుని మళ్లీ తన బాధ్యతల్లో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు టి సంతోష్ చక్రవర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి నానబాల రామకృష్ణ, జిల్లా కోశాధికారి అర్వపల్లి నగేష్, జిల్లా సహాయ కార్యదర్శి వేముల కొండ రమేష్ ,జిల్లా ఈసీ మెంబర్ వీరబాబు,నగర అధ్యక్షుడు గంటేలకుమార్, నగర కార్యదర్శి కప్పల మధు, పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి.!

- నారాయణపురం గ్రామం వద్ద ఘటన.
- టీవీఎస్ ఎక్సెల్‌ను ఢీకొన్న లారీ.
- నిజాయితీ చాటుకున్న 108 సిబ్బంది.







**సత్తుపల్లి, మార్చి 12 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి మండలం నారాయణపురం గ్రామం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై జామకాయలు అమ్ముకుంటూ వస్తుండగా ఎదురుగా వచ్చిన లారీ ఢీకొనడంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల్లో మండాలపాడుకు చెందిన పానెం సులేమన్, రేజర్లకు చెందిన సాలె నాగేశ్వరరావు ఉన్నారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే సత్తుపల్లి 108 అంబులెన్స్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ ఎం. ప్రవీణ్, పైలెట్ రాధాకృష్ణ హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతుల్లో పానెం సులేమన్ వద్ద ఉన్న రూ.10 వేల నగదు మరియు మొబైల్ ఫోన్‌ను వారి బంధువులకు అందజేశారు. అలాగే సాలె నాగేశ్వరరావు మొబైల్ ఫోన్‌ను కూడా కుటుంబ సభ్యులకు అప్పగించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. ప్రమాద స్థలంలో లభించిన వస్తువులను నిజాయితీగా బంధువులకు అందజేసిన సత్తుపల్లి 108 సిబ్బందిని ఖమ్మం జిల్లా 108 మేనేజర్ అవులూరి దుర్గాప్రసాద్ అభినందించారు. మూడు జిల్లాలను పర్యవేక్షిస్తున్న ప్రోగ్రాం మేనేజర్ షేక్ నజీరుద్దీన్ కూడా సిబ్బంది సేవలను ప్రశంసించారు.

# చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి: ఎమ్మెల్యే జారె







- దమ్మపేటలో డ్రగ్స్ నిర్మూలన అవగాహన ర్యాలీ.
- యువతకు మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన.



**దమ్మపేట, మార్చి 12 (తెలంగాణ ముచ్చట్లు):** యువత మాదకద్రవ్యాలు వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉంటేనే మంచి భవిష్యత్తు సాధ్యమవుతుందని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం దమ్మపేట మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ అశ్వారావుపేట ఆధ్వర్యంలో నార్కోటెక్ అధికారుల నేతృత్వంలో డ్రగ్స్ నిర్మూలనపై ప్రధాన రహదారిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వాటి వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డ్రగ్స్ వినియోగం వల్ల ఆరోగ్యానికి, కుటుంబానికి, సమాజానికి కలిగే నష్టాల గురించి అధికారులు, ప్రజాప్రతినిధులు విద్యార్థులకు వివరించారు. యువత తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. తదుపరి ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పట్వారిగూడెం ప్రభుత్వ వైద్యశాలలో నిర్వహించిన ఉచిత ఆరోగ్య శిబిరంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడం రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ప్రజలు ఇలాంటి ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు, దమ్మపేట మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాక రమేష్, దమ్మపేట ఉపసర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, టౌన్ అధ్యక్షుడు చిన్నశెట్టి చిట్టిబాబు, చిన్నశెట్టి యుగంధర్, పగడాల రాంబాబు, ఎమ్మార్వో రామ్ నరేష్, నార్కోటెక్ సీఐ విజయభాస్కర్ రెడ్డి, దమ్మపేట ఎస్సై సాయి కిషోర్ రెడ్డి, ఎక్సైజ్ శాఖ అధికారులు, అంగన్వాడి సిబ్బంది, ప్రభుత్వ డాక్టర్ మణిదీప్, హెల్త్ అధికారులు, ప్రధానోపాధ్యాయురాలు ఉషారాణి, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.






# ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక పై అవగాహన

- ప్రజా సంక్షేమ పథకాలను అర్హులందరికీ చేరేలా చర్యలు
- జిల్లా కలెక్టర్ మను చౌదరి

**మేడ్చల్-మల్కాజిగిరి,మార్చి 12 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి సూచించారు.గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్‌పర్సన్లు, కౌన్సిలర్లు, అధికారులకు ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణపై జిల్లా స్థాయి ఒకరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మార్చి 6 నుండి ప్రారంభమైన ఈ కార్యక్రమం జూన్ 12 వరకు కొనసాగుతుందని తెలిపారు. 99 రోజుల కార్యక్రమంలో గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో ఐదు దశల్లో పది అంశాలపై కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రజా సంక్షేమ పథకాల అమలులో అర్హతలు, ఎంపిక విధానాలను అధికారులు ప్రజలకు స్పష్టంగా వివరించాలని సూచించారు.
ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమం విజయవంతం కావాలంటే స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషించాలని, అధికారులు మరియు ప్రజాప్రతినిధులు కలిసి పనిచేస్తేనే కార్యక్రమం విజయవంతం అవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఏప్రిల్ 2న గ్రామ సభలు, వార్డు సభలు నిర్వహించి ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వాములను చేయాలని సూచించారు.విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళా-యువజన సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పోలీస్, రవాణా, ట్రాఫిక్, ఆర్టీసీ శాఖల తరపున డ్రగ్స్ నియంత్రణ, రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఫైజాన్ అహ్మద్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్ రెడ్డి, డీఆర్ఓ చంద్రవతి, ట్రాఫిక్ ఏసీపీ వెంకట్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్ ఛైర్మన్ నిర్సింహయాదవ్, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్టీఏ కమిషన్ సభ్యులు జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై రూపొందించిన పాటలతో కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.వివిధ శాఖల అధికారులు, నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్లు, వార్డు సభ్యులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# డా. ఏఎస్ రావు డాక్యుమెంటరీకి గద్దర్ అవార్డ్సులో మూడో బహుమతి

- విజ్ఞాన వేదిక కార్యవర్గంలో ఆనందం
- కమలానగర్‌లో సమావేశం నిర్వహణ



**కాప్రా, మార్చి 12 (తెలంగాణ ముచ్చట్లు):** డాక్టర్ ఏఎస్ రావు విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రూపొందించిన "మహా మనిషి డాక్టర్ ఏఎస్ రావు" డాక్యుమెంటరీ చిత్రానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించే గద్దర్ అవార్డ్స్లో ఉత్తమ డాక్యుమెంటరీ చిత్రాల విభాగంలో మూడవ బహుమతి లభించింది.ఈ సందర్భంగా బుధవారం రాత్రి కమలానగర్‌లోని విజ్ఞాన వేదిక కార్యాలయంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సమావేశానికి విజ్ఞాన వేదిక అధ్యక్షులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డాక్టర్ ఏఎస్ రావు దేశానికి, రాష్ట్రానికి ఎలక్ట్రానిక్స్ రంగంలో చేసిన విశేష సేవలకు ఈ అవార్డు ఒక గౌరవప్రదమైన గుర్తింపని తెలిపారు.వేదిక కార్యదర్శి పి.బి. చారి మాట్లాడుతూ, ఈ డాక్యుమెంటరీ విజయం విజ్ఞాన వేదికతో పాటు సుందరయ్య విజ్ఞాన కేంద్రానికి చెందిన ఎస్. వినయ్ కుమార్, భూపతి వెంకటేశ్వర్లు, దాశరథి ఫిలిం సొసైటీ సభ్యులు, ఫిలిం డైరెక్టర్ రఘు, బీడీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సత్యనారాయణ, నటీనటులు, సాంకేతిక నిపుణులు, పాట రచయిత బ్లీమ్ తదితరుల సమిష్టి కృషి ఫలితమని తెలిపారు.చిత్ర నిర్మాణానికి సహకరించిన ఈసీఐఎల్ యాజమాన్యం, అప్పటి ఏఎస్ రావు నగర్ సొసైటీ కార్యవర్గ సభ్యులు, ఆర్థిక సహకారం అందించిన మిత్రులకు అధ్యక్షులు యాదగిరిరావు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికే ఈ డాక్యుమెంటరీకి వివిధ ఫిలిం మేకర్ సొసైటీల ద్వారా ఆరు అవార్డులు లభించాయని పేర్కొన్నారు.గద్దర్ అవార్డును ప్రకటించిన కమిటీ సభ్యులకు విజ్ఞాన వేదిక కార్యవర్గం ధన్యవాదాలు తెలిపింది.ఈ సమావేశంలో కార్యవర్గ సభ్యులు ఎం. వెంకటసుబ్బయ్య, జి. శివరామకృష్ణ, సిహెచ్. లీలావతి, కర్రే మల్లేష్, బి. సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలం సీతారాముల కల్యాణ తలంబ్రాలు ఇంటికే

- కుషాయిగూడ డిపోలో బుకింగ్స్ ప్రారంభం
- కాశీ యాత్రకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు



**కాప్రా, మార్చి 12 (తెలంగాణ ముచ్చట్లు):** శ్రీరామనవమి సందర్భంగా భక్తుల సౌకర్యార్థం భద్రాచలం సీతారాముల కల్యాణోత్సవానికి సంబంధించిన కళ్యాణ తలంబ్రాలను నేరుగా భక్తుల ఇంటికి పంపిణీ చేయనున్నట్లు కుషాయిగూడ డిపో మేనేజర్ వి. వేణుగోపాల్ తెలిపారు. దేవాదాయ శాఖ సహకారంతో ఆర్టీసీ లాజిస్టిక్స్ ద్వారా ఈ సేవ అందించనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భద్రాచలం వెళ్లలేని భక్తులు కూడా ఈ సేవను వినియోగించుకునేలా బుకింగ్స్ ప్రారంభించినట్లు తెలిపారు. తలంబ్రాలు కావలసిన భక్తులు రూ.151 చెల్లించి ఈ నెల 30వ తేదీ లోగా బుక్ చేసుకోవచ్చన్నారు.అదేవిధంగా వివాహాలు, శుభకార్యాలు, విహారయాత్రల కోసం ప్రత్యేక బస్సులను అద్దె ప్రాతిపదికన ప్రైవేటు కంటే తక్కువ ధరకే అందిస్తున్నట్లు చెప్పారు. ప్రతి వారాంతంలో ప్రముఖ పుణ్యక్షేత్రాల సందర్శన కోసం ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు తెలిపారు.ఈ నెల 28వ తేదీన కాశీ యాత్రకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరుతుందని వెల్లడించారు.ఈ యాత్రలో ఉజ్జయిని మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్ జ్యోతిర్లింగాలు, మయ్యర్ శారదా దేవి శక్తిపీఠం, అయోధ్య, ప్రయాగరాజ్ తదితర పుణ్యక్షేత్రాలను రూ.8000 టికెట్ ధరతో దర్శించుకునే అవకాశం కల్పించినట్లు చెప్పారు.ఈ అవకాశాన్ని భక్తులు, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9959226145, 9603549388, 9493210071 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

# బల్దేవ్ ఫౌండేషన్‌తో పేద విద్యార్థులకు విద్యాభరోస




- పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన ఇద్దరికి ఉన్నత చదువులకు సహాయం
– శ్రీశైలం యాదవ్

**కీసర, మార్చ్ 12 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ నియోజకవర్గం కీసర మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం అండగా నిలుస్తామని బల్దేవ్ ఫౌండేషన్ ప్రకటించింది. పదో తరగతి పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించిన ఇద్దరు విద్యార్థులను ఎంపిక చేసి, వారి ఉన్నత చదువులకు ఆర్థిక సహాయం అందిస్తామని బల్దేవ్ ఫౌండేషన్ అధ్యక్షులు శ్రీశైలం యాదవ్ తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువుకు దూరమవుతున్న పేద విద్యార్థులను ఆదుకోవడం ఫౌండేషన్ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. చదువుతోనే విద్యార్థులకు ఉజ్వలమైన భవిష్యత్తు ఉంటుందని, అందుకే ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు సహాయం అందిస్తున్నామని చెప్పారు. ఫౌండేషన్ తరపున భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని జనరల్ సెక్రటరీ గోవర్ధన్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ రామ్ రెడ్డి మాట్లాడుతూ యువకులు ఫౌండేషన్ల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు సహాయం చేయడానికి ముందుకు రావడం అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో బల్దేవ్ ఫౌండేషన్ జనరల్ సెక్రటరీ గోవర్ధన్ రెడ్డి, కోశాధికారి సందీప్ పటేల్, సభ్యులు భాను ముదిరాజ్, మణికంఠ గౌడ్, శ్రావణ్ రెడ్డి, తేజ గౌడ్, ప్రిన్సిపాల్ రామ్ రెడ్డి, పీఈటీ ఆనంద్ పాల్గొన్నారు.

# గిరిజన గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన తహశీల్దార్ రామ్ నరేష్

- విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం.
- వసతులు, విద్యాబోధనపై వివరాలు తెలుసుకున్న అధికారులు.
- విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశం.



**దమ్మపేట, మార్చి 12 (తెలంగాణ ముచ్చట్లు):** దమ్మపేట మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను తహశీల్దార్ రామ్ నరేష్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో అందుబాటులో ఉన్న వసతులను ఆయన స్వయంగా పరిశీలించారు. తరగతి గదులు, వసతి గృహాలు, భోజనశాల వంటి ప్రదేశాలను సందర్శించి విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన, మౌలిక వసతులు, తాగునీరు, పరిశుభ్రత వంటి అంశాలపై పాఠశాల సిబ్బందితో చర్చించారు. విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన తహశీల్దార్, వారికి అందిస్తున్న ఆహారం నాణ్యతను పరిశీలించారు. భోజనం రుచిగా ఉండటంతో సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు ప్రతిరోజూ నాణ్యమైన, పోషకాహారం అందించాలని పాఠశాల సిబ్బందిని ఆదేశించారు. పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రత, భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రభుత్వం విద్యార్థుల అభ్యాసానికి అన్ని విధాలా సౌకర్యాలు కల్పిస్తున్న నేపథ్యంలో, అధికారులు మరియు సిబ్బంది సమన్వయంతో పని చేసి విద్యార్థుల భవిష్యత్తు అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ఈ తనిఖీ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నికార్సైన కాంగ్రెస్ కార్యకర్తలకే పదవులు

- డా. జిల్లెల చిన్నారెడ్డి




**వనపర్తి,మార్చి12(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో వనపర్తి టౌన్ మరియు వనపర్తి మండల నూతన మండల కమిటీలను నియమించారు.జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొత్తకాపు శివసేనారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి, నియోజకవర్గ శాసనసభ్యుడు తూడి మెగా రెడ్డి పాల్గొని కమిటీలను ప్రకటించారు.ఈ సందర్భంగా డా. జిల్లెల చిన్నారెడ్డి మాట్లాడుతూ.. నిజాయితీగా పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకే పార్టీ పదవులు దక్కుతాయని అన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ, సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయాలు సాధించిందని, వచ్చే ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికల్లో కూడా విజయం సాధించే దిశగా పార్టీ ముందుకు సాగుతోందని తెలిపారు.దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కాంగ్రెస్ నాయకులు నిస్వార్థంగా ప్రజలకు సేవ చేయడం వల్లే పార్టీకి ఈరోజు కూడా సుమారు 40 శాతం ఓటు బ్యాంక్ ఉందని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ లాంటి గొప్ప పార్టీ ప్రపంచంలో ఎక్కడా లేదని అన్నారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ఒక సామాజిక కార్యకర్తగా పని చేసి పార్టీకి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రోజుకు సుమారు 18 గంటలు రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని చెప్పారు. సోషల్ మీడియాలో బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మడం లేదన్నారు. బీజేపీ నాయకులు రాహుల్ గాంధీని గతంలో విమర్శించినప్పటికీ, భారత్ జోడో యాత్ర ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకుని ప్రస్తుతం ప్రతిపక్ష నాయకుడిగా కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారని పేర్కొన్నారు.గతంలో కాంగ్రెస్ సభ్యత్వం పార్టీ కార్యాలయంలోనే తీసుకునే పరిస్థితి ఉండేదని, కానీ రాహుల్ గాంధీ సూచనల మేరకు అప్పటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి నాయకత్వంలో వనపర్తి నియోజకవర్గంలో 50 వేలకుపైగా డిజిటల్ సభ్యత్వాలు నమోదు చేసినట్లు తెలిపారు. పది సంవత్సరాలు ప్రతిపక్షంలో ఉన్న సమయంలో కార్యకర్తలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఇప్పుడు పార్టీ అధికారంలో ఉన్న సమయంలో కార్యకర్తలు చురుకుగా పని చేయాలని సూచించారు.కాంగ్రెస్ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని, రాష్ట్ర ప్రభుత్వం మరియు ప్రజల మధ్య వారధిగా పనిచేసే సేవాభావం ఉన్న వారే పార్టీ పదవులు చేపట్టాలని ఆయన అన్నారు. ప్రజాప్రతినిధులు సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసి పార్టీ ఓటు బ్యాంక్ పెంచేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, వనపర్తి జిల్లా ఓబీసీ అధ్యక్షుడు కోట్ల రవి, వనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, జిల్లా ఏఐపీసీ అధ్యక్షుడు నాగార్జున, జిల్లా ప్రధాన కార్యదర్శి చీర్ల జనార్ధన్, మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి, మండల ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు ఎత్తం చరణ్ రాజ్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు, ప్రవీణ్, సీనియర్ నాయకులు కోళ్ల వెంకటేష్, ఎంట్ల రవి, సురేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# మల్కాజిగిరి కమిషనరేట్‌లో మహిళా జన సున్వాయి

- జాతీయ మహిళా కమిషన్ అధ్యక్షురాలు విజయ రహత్కర్ హాజరు
- మహిళల ఫిర్యాదులపై సమీక్ష




**మల్కాజిగిరి, మార్చి 12 (తెలంగాణ ముచ్చట్లు):** మహిళలపై జరుగుతున్న నేరాలకు సంబంధించిన ఫిర్యాదులను పరిష్కరించడం, సంస్థాగత స్పందన వ్యవస్థలను బలోపేతం చేయడం లక్ష్యంగా జాతీయ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో మేడ్చల్-మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో గురువారం "మహిళా జన సున్వాయి" కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జాతీయ మహిళా కమిషన్ అధ్యక్షురాలు విజయ రహత్కర్ అధ్యక్షత వహించారు. తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి, తెలంగాణ ఏసీబీ డీజీ చారు సిన్హా, మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ కె. అవినాష్ మొహంతి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి, హైదరాబాద్ అదనపు పోలీస్ కమిషనర్ (నేరాలు) ఎం. శ్రీనివాస్, ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు తదితర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా నుండి వచ్చిన 30 ఫిర్యాదులు మరియు ప్రత్యక్షంగా వచ్చిన మరో 5 ఫిర్యాదులను స్వీకరించారు. గృహహింస, వేధింపులు, భర్త విడిచిపెట్టడం, సైబర్ నేరాలకు సంబంధించిన కేసులు ప్రధానంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.ఫిర్యాదులను పరిశీలించిన కమిషన్ అధ్యక్షురాలు సంబంధిత అధికారులకు వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8 నుండి 13 వరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం మహిళలకు తమ సమస్యలను నేరుగా తెలియజేసే వేదికగా నిలుస్తుందని తెలిపారు.అలాగే మహిళలపై నేరాల నివారణ, సకాలంలో దర్యాప్తు, విభాగాల మధ్య సమన్వయం పెంపు, పీఓఎస్‌హెచ్ చట్టం మరియు గృహహింస నిరోధక చట్టాల అమలుపై సమావేశంలో చర్చించారు. మహిళల భద్రత, గౌరవం మరియు న్యాయం అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని ఆమె పేర్కొన్నారు.

# దళితుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉండాలి

- హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నిమ్మల మనోహర్




**ఎల్కతుర్తి, మార్చి 12: (తెలంగాణ ముచ్చట్లు):** దళిత హక్కుల పోరాట సమితి (డి హెచ్ పి ఎస్) హనుమకొండ జిల్లా రెండవ మహాసభలను మార్చి 20, 2026న హనుమకొండలోని బాలసముద్రం సిపిఐ పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు సమితి నాయకులు తెలిపారు. మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మహాసభల సందర్భంగా ఎల్కతుర్తి మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో (డి హెచ్ పి ఎస్) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నిమ్మల మనోహర్ మాట్లాడుతూ, భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి దాదాపు 76 సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ దళితులు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని అన్నారు. సమానత్వం, సామాజిక న్యాయం, అభివృద్ధి, కుల నిర్మూలన వంటి అంశాలు కేవలం కాగితాలకే పరిమితమైపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ దళితులు మరియు బలహీన వర్గాల అభివృద్ధి కోసం రాజ్యాంగం ద్వారా కల్పించిన రిజర్వేషన్లను పాలకులు నీరుగారుస్తున్నారని విమర్శించారు. బ్యాక్లాగ్ పోస్టుల భర్తీ విషయంలో కేంద్ర ప్రభుత్వ పనితీరు సంతృప్తికరంగా లేదన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో జనాభా దామాషా ప్రకారం జరిగిన మొత్తం కేటాయింపుల్లో దళితులకు కేవలం 16 శాతం మాత్రమే బడ్జెట్ కేటాయింపులు జరిగాయని తెలిపారు.

2017-18లో ఎస్సీ సబ్ ప్లాన్ రద్దు చేయడం ద్వారా ఎస్సీ అభివృద్ధి యంత్రాంగాన్ని దెబ్బతీసినట్లు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో దళితుల అభివృద్ధి కోసం ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌ను మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు కావస్తున్నప్పటికీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం అంబేద్కర్ హస్తం కింద దళితులకు రూ.12 లక్షల సహాయం అందించడాన్ని విస్మరించిందని విమర్శించారు. ఈ సమావేశంలో దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, మాజీ ఎమ్మెల్యే పోతరాజు, సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, డి హెచ్ పి ఎస్ నిర్మాణ బాధ్యులు కొట్టపాక రవి, జిల్లా కార్యవర్గ సభ్యులు మునిగాల భిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శులు శనిగరపు రాజకుమార్, ఆరెపల్లి చంద్రమౌళి, ఎర్ర ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



## బావను తోసివేయడంతో ఆటో డ్రైవర్ మృతి నిందితుడికి 5 ఏళ్ల జైలు శిక్ష

- **మల్కాజిగిరి కోర్టు తీర్పు రూ.10 వేల జరిమానా విధింపు**
- **2019లో జరిగిన ఘటనకు న్యాయం**



**మల్కాజ్గిరి, మార్చ్ 12 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా కుషాయిగూడ ప్రాంతంలో 2019లో జరిగిన ఆటో డ్రైవర్ మృతి కేసులో మల్కాజిగిరి కోర్టు తీర్పు వెలువరించింది. కేసులో నిందితుడిగా ఉన్న బచ్చలి రాజబాబు @ బాబు (42)ను దోషిగా తేల్చిన కోర్టు అతనికి ఐదేళ్ల కారాగార శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించింది. ఈ మేరకు మల్కాజిగిరి ప్రధాన జిల్లా & సెషన్స్ న్యాయమూర్తి బాలభాస్కర్ తీర్పు ప్రకటించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఫిర్యాదుదారురాలి భర్త డి. సుదర్శన్ ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ మల్కాజిగిరి పరిధిలోని ఏకల వ్యాస్ నగర్‌లో నివసించేవాడు. 2019 మార్చి 30న ఉదయం పని కోసం బయటకు వెళ్లిన సుదర్శన్, అదే రోజు రాత్రి తన బావ బాబు మరియు స్నేహితుడు సురేష్‌తో కలిసి మల్కాజిగిరిలోని సాయిరామ్ థియేటర్ సమీపంలో ఉన్నట్లు భార్యకు ఫోన్ ద్వారా తెలిపాడు.ఆ రాత్రి ముగ్గురు కలిసి మల్కాజిగిరిలోని ఒక బార్ అండ్ రెస్టారెంట్‌లో మద్యం సేవించిన అనంతరం మల్కాజిగిరి జంక్షన్ సమీపంలో సుదర్శన్ మరియు అతని బావ బాబు మధ్య కుటుంబ విషయంపై వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో కోపోద్రిక్తుడైన బాబు సుదర్శన్‌ను బలంగా తోసివేయడంతో అతను వెనుక భాగం తలతో రోడ్డుపై పడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు.తక్షణమే ఆసుపత్రికి తరలించినప్పటికీ వైద్యులు సుదర్శన్ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై మల్కాజిగిరి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.దర్యాప్తు అనంతరం కోర్టులో సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడిని దోషిగా తేల్చి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. ఈ కేసును విజయవంతంగా ఛేదించిన పోలీసు అధికారులను మల్కాజిగిరి పోలీస్ ఇన్‌స్పెక్టర్ అభినందించారు.

## పదోవ తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 బి ఎన్ ఎస్ అమలు

- **పోలీస్ కమిషనర్ సునీల్ దత్**




**ఖమ్మం బ్యూరో, మార్చి 12(తెలంగాణ ముచ్చట్లు):** మార్చి 14 నుండి ఏప్రిల్ 16 వరకు ఖమ్మం కమిషనరేట్ పరిధిలోని 98 పరీక్ష కేంద్రాలలో నిర్వహించే పదోవ తరగతి పబ్లిక్ పరీక్షల సందర్భంగా అయా పరీక్ష కేంద్రాల వద్ద ఉదయం 8:30 గంటల నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు సెక్షన్ 163 బి ఎన్ ఎస్ ఎస్ యాక్ట్ 2023 (భారతీయ నాగరిక్ సురక్షా సంహిత) అమలులో వుంటుందని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా వుండరాదని సూచించారు. అదేవిధంగా ఏలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలకు, మైకులు, డిజేలతో ఉరేగింపులు, దర్నలు, ప్రచారాలు నిర్వహించరాదని పెర్కొన్నారు. పరీక్ష సమయంలో పరిసరాలలోని ఇంటర్నెట్ సెంటర్స్, జిరాక్స్ షాపులు, స్టేషనరీ దుకాణాలు మూసివేయాలని సూచించారు. పరిక్ష సమయంలో ఎటువంటి ఆటంకాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా 163 సెక్షన్ అమలు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ నేపథ్యంలో వివిధ వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని సూచించారు. అదేవిధంగా పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు తో పాటు ట్రాఫిక్ ఆంతరాయం కలగకుండా ట్రాఫిక్ పోలీసులు పకడ్బంది చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో పోలీస్ పెట్రోలింగ్ పార్టీలను నియమించనునట్లు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు నిఘాను నియమించి సమాచారం సేకరించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలున తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

## హత్య కేసులో జీవిత ఖైదు, పది వేలు జరిమానా విధించిన న్యాయమూర్తి

- **ప్రాసిక్యూషన్ కు సహకరించిన అధికారులను అభినందించిన పోలీస్ కమిషనర్**

**ఖమ్మం బ్యూరో, మార్చి 12(తెలంగాణ ముచ్చట్లు ):** హత్య కేసులో ఒడిశా రాష్ట్రం, గంజాం జిల్లా, అమరావతి మండలం, బోరిపాధర్ గ్రామానికి చెందిన శిభా భిషోయ్ (29) కు జీవిత ఖైదు, 10 వేల రూపాయలు జరిమానా విధిస్తూ.. 6వ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు సత్తుపల్లి, న్యాయమూర్తి యం.శ్రీనివాస్ తీర్పు వెల్లడించారని మధిర ఇన్స్పెక్టర్ మధు తెలిపారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం..2025 జూన్ 8న రాత్రి సమయంలో
మధిర రూరల్ మండలం కొదమూరు రోడ్డు కన్స్ట్రక్షన్ పనిచేసే సుమంత్ కుమార్ పండే పై శిభా భిషోయ్ అనే వ్యక్తి పాత ఘర్షణపై కక్ష పెంచుకొని మంచం పై పడుకొని ఉన్న సుమంత్ కుమార్ పండే పై ఇనుపరాడుతో దాడి చేసి హత్య చేసి పారిపోయినట్లు సెక్యూరిటీ సూపర్వైజర్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాపు పూర్తి చేసి అభియోగ పత్రాన్ని న్యాయంస్థానంలో సమర్పించగా.. వాదోపవాదనలు విన్న న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కు సహకరించిన మధిర రూరల్ పోలీసు అధికారులకు, ఇన్వెస్టిగేషన్ అధికారులు ఇన్స్పెక్టర్ మధు,ఎస్సై లక్ష్మీ భార్గవి అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజారావు, కోర్టు కానిస్టేబుల్ బి వీరబాబు కోర్టు. లైజన్ ఎస్సై శ్రీకాంత్ ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు.





# బండి సంజయ్ పాదయాత్ర విజయవంతానికి బీజేపీ శ్రేణులు సిద్ధం

- **ఎల్కతుర్తి బిజెపి మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్**

**ఎల్కతుర్తి, మార్చి 12: (తెలంగాణ ముచ్చట్లు):** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చేపట్టనున్న కరీంనగర్-కొండగట్టు పాదయాత్రను విజయవంతం చేయాలని బీజేపీ నాయకులు, కార్యకర్తలు పిలుపునిచ్చారు. ఈ మేరకు హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో బీజేపీ శ్రేణులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం ఎల్కతుర్తి మండల బీజేపీ అధ్యక్షులు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగింది.
కరీంనగర్ మున్సిపాలిటీతో పాటు సర్పంచ్, వార్డ్ మెంబర్ ఎన్నికల విజయోత్సవం సందర్భంగా బండి సంజయ్ కరీంనగర్ నుండి కొండగట్టు వరకు పాదయాత్ర చేసి ఆంజనేయ స్వామిని దర్శించుకుంటానని ఇచ్చిన మాట మేరకు ఈ నెల 14వ తేదీ శనివారం ఉదయం 6 గంటలకు కరీంనగర్ శక్తిపీఠం నుండి కొండగట్టు వరకు పాదయాత్ర నిర్వహించనున్నారు. ఈ పాదయాత్రలో గెలిచిన మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, వార్డ్ మెంబర్లు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని బండి సంజయ్‌తో కలిసి పాదయాత్రగా వెళ్లి అంజన్న స్వామిని దర్శించుకోవాలని నిర్ణయించారు.
ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రతి గ్రామం నుండి కనీసం 10 మందికి తగ్గకుండా మొత్తం 250 మంది కరీంనగర్‌కు చేరుకొని పాదయాత్రలో పాల్గొనాలని గ్రామ శక్తి కేంద్ర ఇంచార్జిలకు, బూత్ అధ్యక్షులకు మరియు సర్పంచ్‌లు, వార్డ్ మెంబర్‌లుగా పోటీ చేసిన అభ్యర్థులకు సూచించారు.
అలాగే సూరారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తక్కలపల్లి సంపత్ రావు (కబడ్డీ సంపత్ రావు)ను భారతీయ జనతా పార్టీలోకి ఆహ్వానించి శాలువాతో సన్మానించారు.
ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఎర్రగొల్ల శ్రీనివాస్ యాదవ్, సీనియర్ నాయకులు చిదురల వెంకటేష్, మాజీ సర్పంచులు శ్యామల సురేష్ రెడ్డి, కుడుతాడు రాజు, చల్ల రవీందర్ రెడ్డి, శక్తి కేంద్ర ఇంచార్జ్ ఠాకూర్ శామ్ సింగ్, సింగణబోయిన రాజు, అంబీర్ శ్రీనివాస్, బీట్ల లింగయ్య, చదిరం రాకేష్, కొలిపకా శ్రీనివాస్, వీరమళ్ళ కృష్ణారెడ్డి, బొక్కల పాటి కుమార్, కొమ్మిడి లచ్చిరెడ్డి, ముప్పు రమేష్, సల్వాల కిరణ్, సిద్ధు, గానబోయిన నాగరాజు, ఆర్ఎంపీ రంజిత్, కనుకుంట్ల రమణాచారి, విద్యాసాగర్, తోట మల్లయ్య, అల్లి కుమార్, గొర్రె ప్రవీణ్, వడ్లకొండ రమేష్, గూడెం నాగరాజు, నరేడ్ల శంకర్, సాతూరి సురేందర్ పాల్గొన్నారు.

# కమలనగర్ అసోసియేషన్ కార్యాలయం దగ్ధం

- **ఫర్నీచర్, ముఖ్య రికార్డులు పూర్తిగా నష్టం**
- **మాజీ కార్పొరేటర్ కొత్త రామారావుతో కలిసి పరిశీలించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**
- **వర్గ విభేదాల నేపథ్యంలో అనుమానాలు**



**కాప్రా, మార్చి 12 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ డా. ఏఎస్ రావు నగర్ డివిజన్ పరిధిలోని సౌత్ కమలనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం అనుమానాస్పద పరిస్థితుల్లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో కార్యాలయంలో ఉన్న ఫర్నీచర్‌తో పాటు ముఖ్యమైన రికార్డులు పూర్తిగా దగ్ధమయ్యాయి. అగ్నిప్రమాదంలో సుమారు రూ.8 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావుతో కలిసి ఘటన స్థలాన్ని పరిశీలించారు. అగ్నిప్రమాదం కారణంగా జరిగిన నష్టాన్ని పరిశీలించి, సంఘటనపై పూర్తి వివరాలు తెలుసుకున్నారు.
ఇటీవల అసోసియేషన్‌లో వర్గ విభేదాలు నెలకొన్న నేపథ్యంలో ఈ ఘటనపై స్థానికుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఘటనకు కారణమైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అధికారులను కోరారు.ఈ సందర్భంగా పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, స్థానిక నాయకులు మరియు అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# గ్యాస్ సిలిండర్ల అక్రమ మళ్ళింపుపై కఠిన చర్యలు..

- **అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి**





**ఖమ్మం బ్యూరో, మార్చి- 12(తెలంగాణ ముచ్చట్లు):** డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల అక్రమ వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి హెచ్చరించారు. గురువారం అదనపు కలెక్టర్, కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అధికారులతో సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, డొమెస్టిక్ ఎల్పీజీ సిలిండర్లను ఏ వ్యక్తి అయినా సరే అక్రమంగా నిల్వ చేయడం పూర్తిగా నిషేధించామన్నారు.
హోటళ్ళు, రెస్టారెంట్లలో డొమెస్టిక్ సిలిండర్లను వినియోగించడం చట్టవిరుద్ధమని తెలిపారు. వాణిజ్య అవసరాలకు కేవలం కమర్షియల్ సిలిండర్లు మాత్రమే వాడాలని అదనపు కలెక్టర్ అన్నారు.
డొమెస్టిక్ సిలిండర్లను అక్రమంగా మళ్ళించిన వారిపై ఇసి యాక్ట్ 1955, సెక్షన్ 6ఏ కింద కేసులు నమోదు చేయడంతో పాటు తీవ్రమైన క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామని అన్నారు. సివిల్ సప్లయిస్ అధికారులు నిరంతరం దాడులు నిర్వహించాలన్నారు.నియమాలు ఉల్లంఘించిన వారి లైసెన్సులు రద్దు చేయలన్నారు.
ఎల్పీజీ సబ్సిడీ లబ్ధిదారులందరూ వెంటనే ఇకేవైసి పూర్తి చేసుకోవాలని అదనపు కలెక్టర్ అన్నారు. గ్యాస్ సిలిండర్ డెలివరీ సమయంలో గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది అడిగినప్పుడు లబ్ధిదారులు తప్పనిసరిగా ఓటిపి అందించి సహకరించాలన్నారు.ఓటిపి ఇవ్వకపోతే, సబ్సిడీ నిలిపివేయబడే అవకాశం ఉందని తెలిపారు. ఇకేవైసి చేయించుకోకపోతే భవిష్యత్తులో గ్యాస్ సిలిండర్ సరఫరా నిలిపివేయబడుతుందని అన్నారు. లబ్ధిదారులు అత్యంత త్వరగా సమీప గ్యాస్ ఏజెన్సీని సంప్రదించి ఇకేవైసి పూర్తి చేసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. డొమెస్టిక్ సిలిండర్ల అక్రమ వినియోగం గురించి సమాచారం ఉన్న వారు వెంటనే సివిల్ సప్లయిస్ విభాగానికి లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని అదనపు కలెక్టర్ కోరారు. సర్కారు సబ్సిడీపై అందించే డొమెస్టిక్ సిలిండర్లు కేవలం సాధారణ గృహ వినియోగదారుల కోసం మాత్రమే అని, వాటిని వాణిజ్య అవసరాలకు దుర్వినియోగం చేయడం ప్రభుత్వానికి, సామాన్య ప్రజలకు తీవ్రమైన నష్టం కలిగిస్తుందని ఆదనపు కలెక్టర్ స్పష్టం చేశారు.
ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ముస్లింల సంక్షేమానికి పెద్దపీట : మంత్రి పొంగులేటి

- **ఏదులాపురంలో ఘనంగా ఇఫ్తార్ విందు**

**ఖమ్మం బ్యూరో, మార్చి 12(తెలంగాణ ముచ్చట్లు):** ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, ప్రతి ముస్లిం కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందేలా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్డు వద్ద ఉన్న 'మస్జిద్ ఏ ఉమర్'లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. "పవిత్ర రంజాన్ మాసం క్రమశిక్షణకు, భక్తిభావానికి, మానవత్వానికి నిదర్శనం అన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ముస్లిం మైనార్టీల రక్షణకు, వారి అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న మైనార్టీ సోదరులందరికీ నా ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్నాను," అని ఆయన వ్యాఖ్యానించారు.



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# ధోనీకి భారీ ఊరట..! ఫిర్యాదును కొట్టేసిన ఎథిక్స్ అధికారి



ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందే చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీకి పెద్ద ఊరట లభించింది. పరస్పర విరుద్ధ ప్రయోజనాలు పొందుతున్నారనే ఆరోపణలతో ఆయనపై దాఖలైన ఫిర్యాదును బీసీసీఐ ఎథిక్స్ అధికారి కొట్టివేశారు. దీంతో ధోనీపై ఉన్న వివాదం ముగిసినట్లయింది. ఇక ఐపీఎల్ 19వ సీజన్‌లో సీఎస్కే తరఫున మరోసారి తన ఆటతో అభిమానులను అలరించేందుకు ధోనీ సిద్ధమవుతున్నాడు.

భారత క్రికెట్‌లో వివాదాలకు దూరంగా ఉండే ఆటగాడిగా పేరున్న ధోనీపై ఈ ఫిర్యాదు రావడం అప్పట్లో చర్చనీయాంశంగా మారింది. సీఎస్కే ఆటగాడిగా కొనసాగుతున్న ధోనీ ఒక క్రికెట్ అకాడమీ నిర్వహణలో భాగస్వామిగా ఉన్నాడనే కారణంతో పరస్పర విరుద్ధ ప్రయోజనాల ఆరోపణలు వచ్చాయి. 'ఆర్కా స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్' అనే సంస్థ నిర్వహిస్తున్న అకాడమీలో ధోనీ భాగస్వామిగా ఉన్నాడని, అది బీసీసీఐ నియమావళికి విరుద్ధమని ఫిబ్రవరి 28న ఫిర్యాదు చేశారు.

ఫిర్యాదుదారు ప్రకారం ధోనీ ఐపీఎల్ ఆటగాడిగా ఉండి అకాడమీ నిర్వహణలో భాగస్వామ్యం కావడం బీసీసీఐ నియమావళిలోని కొన్ని నిబంధనలకు విరుద్ధమని ఆరోపించారు. ముఖ్యంగా పరస్పర విరుద్ధ ప్రయోజనాలకు సంబంధించిన నిబంధనలను ఉల్లంఘించారని పేర్కొంటూ ధోనీపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశాన్ని పరిశీలించిన బీసీసీఐ ఎథిక్స్ అధికారి జస్టిస్ అరుణ్ మిశ్రా పూర్తి వివరాలను పరిశీలించి తుది నిర్ణయం వెల్లడించారు. ఆర్కా స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ సంస్థ నిర్వహిస్తున్న క్రికెట్ అకాడమీ 2017లోనే రిజిస్టర్ అయిందని, అయితే పరస్పర విరుద్ధ ప్రయోజనాలకు సంబంధించిన బీసీసీఐ నిబంధనలు 2018 సెప్టెంబర్‌లో అమల్లోకి వచ్చాయని ఆయన పేర్కొన్నారు. అందువల్ల ఆ నిబంధనలు ధోనీపై వర్తించవని స్పష్టం చేశారు. అలాగే ఆ అకాడమీ నిర్వహణలో ధోనీ పాత్ర కూడా పరిమితంగానే ఉందని తెలిపారు.

ఫిర్యాదులో పేర్కొన్న అంశాలు సరైన ఆధారాలతో లేవని, ఈ కేసు వెనుక మూడో వ్యక్తుల పాత్ర ఉండొచ్చని కూడా ఎథిక్స్ అధికారి అభిప్రాయపడ్డారు. వ్యక్తిగత విభేదాల కారణంగానే ఈ ఫిర్యాదు నమోదై ఉండవచ్చని పేర్కొంటూ ధోనీపై ఎలాంటి చర్యలు తీసుకోవాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పారు.

ఈ నిర్ణయంతో ధోనీపై ఉన్న వివాదం పూర్తిగా ముగిసింది. ఇప్పటికే నెట్స్‌లో తీవ్రంగా సాధన చేస్తున్న ధోనీ ఐపీఎల్ 2026 సీజన్‌కు సిద్ధమవుతున్నాడు. చెన్నై సూపర్ కింగ్స్ అభిమానులు కూడా తమ ప్రియమైన కెప్టెన్ మరోసారి జట్టును విజయపథంలో నడిపిస్తాడని ఆశిస్తున్నారు.

# టీమిండియా టీ20 ప్రపంచకప్ గెలుపు రహస్యాన్ని బయటపెట్టిన కెప్టెన్ సూర్యకుమార్



టీ20 ప్రపంచకప్ 2026లో భారత జట్టు చరిత్ర సృష్టించింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో న్యూజిలాండ్‌ను 96 పరుగుల తేడాతో ఓడించి భారత్ మూడోసారి టీ20 ప్రపంచకప్ ట్రోఫీని కైవసం చేసుకుంది. ఈ విజయంతో మూడు టీ20 ప్రపంచకప్‌లు గెలిచిన తొలి జట్టుగా టీమిండియా అరుదైన రికార్డును నెలకొల్పింది.

టోర్నమెంట్ మొత్తం భారత జట్టు అద్భుత ప్రదర్శన కనబరిచింది. సూపర్ 8 దశలో దక్షిణాఫ్రికాతో జరిగిన ఒక్క మ్యాచ్‌లో మాత్రమే భారత్ ఓటమి పాలైంది. ఆ ఓటమితో సెమీఫైనల్ అవకాశాలు కాస్త సంక్లిష్టంగా మారాయి. అయితే వెస్టిండీస్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన భారత జట్టు ఘన విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరుకుంది. అక్కడ నుంచి తిరుగులేని ప్రదర్శనతో ఫైనల్‌లో న్యూజిలాండ్‌పై భారీ విజయం నమోదు చేసి ట్రోఫీని ఎత్తుకుంది.

ప్రపంచకప్ విజయం అనంతరం కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ జట్టు విజయానికి కారణమైన కొన్ని ఆసక్తికర విషయాలను వెల్లడించాడు. దక్షిణాఫ్రికాతో ఓటమి తర్వాత జట్టును తిరిగి ఉత్సాహపరిచేందుకు డ్రెస్సింగ్ రూమ్‌లో తీసుకున్న చర్యలే కీలకంగా మారాయని తెలిపాడు.

ప్రాక్టీస్ సెషన్లలో ఆటగాళ్లలో పోటీ భావన పెంచేందుకు ఫీల్డింగ్ కోచ్ టి దిలీప్ ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించాడని సూర్య వివరించాడు. ప్రాక్టీస్‌లో అత్యుత్తమ ఫీల్డర్‌కు రూ.10,000 నగదు బహుమతి ప్రకటించడంతో ఆటగాళ్లలో ఉత్సాహం పెరిగిందని చెప్పాడు. ప్రతి ప్రాక్టీస్ సెషన్‌లో ఫీల్డింగ్‌కు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వడం వల్ల జట్టు ఫీల్డింగ్ స్థాయి మరింత మెరుగుపడిందని తెలిపాడు.

దక్షిణాఫ్రికాతో ఓటమి తర్వాత జట్టు మానసికంగా బలపడేందుకు వీడియో అనలిస్ట్ ప్రత్యేక వీడియో రూపొందించాడని సూర్య తెలిపాడు. గత రెండేళ్ల జట్టు ప్రయాణాన్ని చూపిస్తూ పది నిమిషాల వీడియోను ప్లేయర్లకు చూపించారని వివరించాడు. బ్యాటర్ల కోసం బాహుబలి పాటను, బౌలర్ల కోసం మరో ప్రేరణాత్మక పాటను జతచేసి ఆ వీడియో రూపొందించారని చెప్పాడు. ఆ వీడియో ఆటగాళ్లలో కొత్త ఉత్సాహాన్ని నింపిందని సూర్యకుమార్ వెల్లడించాడు.

జట్టులో స్వేచ్ఛాయుత వాతావరణం ఉండటమే తమ బలం అని సూర్య స్పష్టం చేశాడు. డ్రెస్సింగ్ రూమ్‌లో ప్రతి ఆటగాడి అభిప్రాయానికి విలువ ఉంటుందని చెప్పాడు. అందరూ ఒకరికొకరు మద్దతుగా ఉండటం వల్ల ఒత్తిడి తగ్గుతుందని వివరించాడు. కొన్నిసార్లు ఆటగాళ్లు సరదాగా మాట్లాడటం కూడా జట్టులో మంచి వాతావరణాన్ని తీసుకువచ్చిందని చెప్పాడు.

రింకూ సింగ్ ఇంగ్లీష్ మాట్లాడేందుకు ప్రయత్నించిన సందర్భాలు, తిలక్ వర్మ తన హైదరాబాదీ యాసలో మాట్లాడినప్పుడు జరిగిన సరదా సంఘటనలు డ్రెస్సింగ్ రూమ్‌లో నవ్వులు పూయించేవని సూర్య చెప్పాడు. ఇలాంటి చిన్న చిన్న సంఘటనలే జట్టును మైదానం బయట కూడా బలంగా కలిపి ఉంచాయని పేర్కొన్నాడు. మొత్తంగా సమష్టి కృషి, ఆటగాళ్ల మధ్య ఉన్న అనుబంధం, సానుకూల వాతావరణమే టీమిండియాను మరోసారి ప్రపంచ ఛాంపియన్‌గా నిలిపిందని సూర్యకుమార్ యాదవ్ స్పష్టం చేశాడు.

# సచిన్ రిటైర్మెంట్ వెనుక అసలు కథ.. ఏళ్ల తర్వాత బయటపెట్టిన సందీప్ పాటిల్

భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ రిటైర్మెంట్‌కు సంబంధించిన ఆసక్తికరమైన విషయాలను బీసీసీఐ మాజీ చీఫ్ సెలెక్టర్ సందీప్ పాటిల్ వెల్లడించాడు. సచిన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలకడానికి ఏడాది ముందే అతడిని జట్టు నుంచి తప్పించాలని సెలక్షన్ కమిటీ భావించిందని తెలిపాడు. ఈ విషయాన్ని నేరుగా సచిన్‌కు చెప్పినప్పుడు అతను తీవ్ర ఆశ్చర్యానికి గురయ్యాడని పేర్కొన్నాడు. సచిన్ టెండూల్కర్ 24 సంవత్సరాల పాటు అంతర్జాతీయ క్రికెట్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచి 2013లో రిటైర్మెంట్ ప్రకటించాడు. అయితే 2012లో అతని ఫామ్ ఆశించినంతగా లేకపోవడంతో సెలక్షన్ కమిటీ ప్రత్యామ్నాయ ఆటగాళ్లపై దృష్టి పెట్టినట్లు సందీప్ పాటిల్ వివరించాడు. ఆ సమయంలో తాను సచిన్‌తో నేరుగా మాట్లాడినట్లు ఆయన తెలిపాడు. మీ భవిష్యత్ ప్రణాళికలు ఏమిటని అడిగినప్పుడు సచిన్ ఎందుకు అని ప్రశ్నించాడని గుర్తుచేసుకున్నాడు. సెలక్షన్ కమిటీ మీ స్థానంలో మరొకరిని చూడాలని ఆలోచిస్తున్నట్లు చెప్పగానే సచిన్ షాక్‌కు గురయ్యాడని వివరించాడు. కొద్దిసేపటి తర్వాత మళ్లీ ఫోన్ చేసి మీరు చెప్పింది నిజమేనా అని అడిగాడని, తాను అవునని స్పష్టం చేసినట్లు పాటిల్ చెప్పాడు. అయితే సెలక్టర్లకు ఒక ఆటగాడిని బలవంతంగా రిటైర్ చేయించే అధికారం ఉండదని ఆయన స్పష్టం చేశాడు. సెలక్టర్లు కేవలం జట్టులో నుంచి తప్పించగలరే తప్ప ఆటగాడి కెరీర్ ముగిసిందని చెప్పలేరని తెలిపాడు. సచిన్ కొనసాగాలనే ఆసక్తి చూపడంతో తాము కూడా అతనికి మద్దతుగా నిలిచామని పేర్కొన్నాడు. చివరకు రిటైర్మెంట్ నిర్ణయాన్ని సచిన్ స్వయంగా తీసుకుని సెలక్షన్ కమిటీకి తెలియజేశాడని చెప్పాడు. తన హయాంలో భారత జట్టులోకి అనేక ప్రతిభావంతులైన ఆటగాళ్లను తీసుకువచ్చామని పాటిల్ పేర్కొన్నాడు. జస్ప్రీత్ బుమ్రా, రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా, అజింక్యా రహానే, మహమ్మద్ షమీ వంటి ఆటగాళ్లు అదే సమయంలో జట్టులోకి వచ్చినట్లు వివరించాడు. అయినప్పటికీ ప్రజలు ఆ విషయాలను గుర్తుంచుకోకుండా కేవలం సచిన్‌ను తప్పించామని మాత్రమే గుర్తు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. చివరకు సచిన్ టెండూల్కర్ 2013 నవంబర్‌లో ముంబైలోని వాంఖడే స్టేడియంలో వెస్టిండీస్‌తో జరిగిన తన చివరి టెస్ట్ మ్యాచ్ ఆడి అంతర్జాతీయ క్రికెట్‌కు ఘనంగా వీడ్కోలు పలికాడు. ఆ మ్యాచ్‌తో ప్రపంచ క్రికెట్‌లో ఒక గొప్ప యుగానికి ముగింపు పలికినట్లు అభిమానులు భావించారు.





# కీరవాణి కుమారుడితో ప్రేమలో కావ్య కళ్యాణ్ రామ్?.. పెళ్లి వార్తలు వైరల్

తెలుగు సినీ పరిశ్రమలో బాలనటిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న కావ్య కళ్యాణ్ రామ్ తర్వాత హీరోయిన్‌గా మారి తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. చిన్నప్పుడే పలు సినిమాల్లో నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్న ఆమె, పెద్దయ్యాక కూడా హీరోయిన్‌గా వరుస అవకాశాలు అందుకుంటోంది. ఆమె నటించిన మసూదా, బలగం, ఉస్తాద్ వంటి సినిమాలు మంచి గుర్తింపును తెచ్చిపెట్టాయి. ముఖ్యంగా బలగం సినిమా భారీ విజయాన్ని సాధించడంతో కావ్యకు మరింత ప్రజాదరణ పెరిగింది. ప్రస్తుతం కూడా ఆమె పలు కొత్త సినిమాలతో బిజీగా ఉంది. సినిమాలతో పాటు సామాజిక మాధ్యమాల్లో కూడా ఆమె చురుకుగా ఉంటూ తరచూ ఫోటోలు, వీడియోలు పంచుకుంటూ అభిమానులతో టచ్‌లో ఉంటుంది. ఆమె పోస్ట్ చేసే చిత్రాలు తరచూ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతుంటాయి.

ఇదిలా ఉండగా ప్రస్తుతం కావ్య కళ్యాణ్ రామ్ పెళ్లి గురించి సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. ప్రముఖ సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణి పెద్ద కుమారుడు, గాయకుడు మరియు సంగీత దర్శకుడు కాల భైరవతో ఆమె ప్రేమలో ఉన్నారని వార్తలు వినిపిస్తున్నాయి. కాల భైరవ మొదట గాయకుడిగా తన ప్రయాణాన్ని ప్రారంభించి మంచి గుర్తింపు సంపాదించాడు. అనంతరం సంగీత దర్శకుడిగా కూడా పలు చిత్రాలకు సంగీతం అందిస్తూ తన ప్రతిభను చాటుకుంటున్నాడు. తన ప్రత్యేక శైలితో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ సినీ పరిశ్రమలో మంచి స్థానం సంపాదించుకున్నాడు.

గత కొన్నేళ్లుగా కాల భైరవ మరియు కావ్య కళ్యాణ్ రామ్ మధ్య ఉన్న స్నేహం ప్రేమగా మారిందని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. వీరిద్దరూ చాలా కాలంగా ఒకరినొకరు ప్రేమిస్తున్నారని, ఇప్పటికే ఇరు కుటుంబాలు కూడా వారి సంబంధాన్ని అంగీకరించాయని వార్తలు వినిపిస్తున్నాయి. ఈ ఏడాదిలోనే వీరి పెళ్లి జరిగే అవకాశం ఉందని కూడా సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇదిలా ఉండగా కీరవాణి కుటుంబంలో ఇటీవల మరో వివాహం కూడా జరిగింది. ఆయన చిన్న కుమారుడు సింహా కోడూరి ప్రముఖ నటుడు మురళీ మోహన్ మనవరాలిని వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. ఇప్పుడు పెద్ద కుమారుడు కాల భైరవ పెళ్లి కూడా జరగబోతుందన్న వార్తలు రావడంతో ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో హాట్ టాపిక్‌గా మారింది. అయితే ఇప్పటివరకు ఈ వార్తలపై కావ్య కళ్యాణ్ రామ్ లేదా కాల భైరవ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. దీంతో ఈ ప్రేమ, పెళ్లి వార్తలు నిజమా కాదా అన్నది తెలియాలంటే అధికారిక స్పష్టత వచ్చే వరకు వేచి చూడాల్సిందే.



# 20 ఏళ్లుగా ఇండస్ట్రీలో గుర్తింపు.. నటనకు దూరమై నిర్మాతగా మారిన చార్మీ కౌర్

సినిమా పరిశ్రమలో ఎన్నో మంది హీరోయిన్లు కొంతకాలం తర్వాత సినిమాలు తగ్గించి ఇతర రంగాల్లో బిజీ అవుతుంటారు. కొందరు వివాహం చేసుకుని వ్యక్తిగత జీవితంలో స్థిరపడితే, మరికొందరు వ్యాపారాల్లోకి అడుగుపెడతారు. అందం, అభినయం ఉన్నప్పటికీ సినిమాలకు దూరమైపోయిన హీరోయిన్లు కూడా ఉన్నారు. అలాంటి వారిలో ఒకరు చార్మీ కౌర్. ఒకప్పుడు టాలీవుడ్‌లో మంచి క్రేజ్ సంపాదించిన ఈ నటి ఇప్పుడు నటనకు పూర్తిగా దూరమై నిర్మాతగా కొనసాగుతున్నారు. చార్మీ కౌర్ తెలుగు సినీ పరిశ్రమలో మాస్, లక్ష్మి, స్టైల్, మంత్ర, జ్యోతి లక్ష్మి వంటి చిత్రాల్లో నటించి ప్రేక్షకుల అభిమానాన్ని సంపాదించారు. తన అందం, గ్లామర్‌తో పాటు నటనతో కూడా మంచి గుర్తింపు పొందారు. హీరోయిన్లలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించిన ఆమెకు ఆ సమయంలో వరుస అవకాశాలు కూడా వచ్చాయి. అయితే కెరీర్ మంచి స్థాయిలో ఉండగానే ఆమె నటనకు గుడ్‌బై చెప్పడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది.

తర్వాత ఆమె నిర్మాతగా మారి దర్శకుడు పూరి జగన్నాథ్‌తో కలిసి చిత్రాల నిర్మాణంలో భాగమయ్యారు. ఇద్దరూ కలిసి పలు సినిమాలు నిర్మించగా వాటిలో జ్యోతి లక్ష్మి, ఇస్మార్ట్ శంకర్ వంటి చిత్రాలు మంచి విజయాన్ని సాధించాయి. ప్రస్తుతం చార్మీ కౌర్ నిర్మాణ రంగంలోనే ఎక్కువగా దృష్టి సారిస్తున్నారు.

ఇదిలా ఉండగా దర్శకుడు కృష్ణవంశీ ఒక ఇంటర్వ్యూలో చార్మీ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. చార్మీ ఎంతో కష్టపడే నటి అని, ఆమె అద్భుతమైన ప్రతిభ కలిగిన కళాకారిణి అని చెప్పారు. సినిమా కోసం ఎంత కష్టమైనా పడేందుకు సిద్ధంగా ఉండే ఆమెకు కొన్నిసార్లు గాయాలు అయినప్పటికీ పట్టించుకోకుండా నటించేదని తెలిపారు. శ్రీ ఆంజనేయం, చక్రం వంటి చిత్రాల చిత్రీకరణ సమయంలో అలాంటి సంఘటనలు జరిగినట్లు ఆయన గుర్తుచేశారు. చార్మీ ఎందుకు మరింత పెద్ద స్థాయిలో విజయాలు సాధించలేకపోయిందో అర్థం కావడం లేదని, అది పూర్తిగా అదృష్టం సమస్య అని కృష్ణవంశీ అభిప్రాయపడ్డారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in